





నందం అబద్దయ్య



పిల్లి మాణిక్యాలరావు

జడ్పీ బదిలీల్లో.. ఇష్టారాజ్యం

- వైసీపీకి అనుకూల ఉద్యోగులకు ప్రాధాన్యం
- ఎమ్మెల్యేల సిఫార్సులను పట్టించుకోని వైనం
- ఉనికిలో లేని జీవోల ఆధారంగా ఏవోల తిష్ఠ
- నరేంద్రకు వ్యతిరేకంగా పనిచేసిన అధికారికి అందలం
- 'నిమ్మగడ్డ'కు ఓటు ఇవ్వని వారికి పెదకాకాని పోస్టింగ్
- సీటుకు రేటు కట్టి మరీ వసూలు చేసిన ఓ అధికారి
- ఓ ఉద్యోగితో నగదు వసూలు చేయించినట్లు ఆరోపణలు



గుంటూరు సిటీ, సెప్టెంబరు 24: వైసీపీ అనుకూల ఉద్యోగులకు అందలం.. అడిగినంత ఇచ్చిన వారికి ప్రాధాన్యం.. ఎమ్మెల్యేల సిఫార్సులకు దక్కని గౌరవం.. ఇదీ తాజాగా ఉమ్మడి గుంటూరు జడ్పీలో జరిగిన బదిలీల వ్యవహారం. బదిలీల్లో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. కింది స్థాయి ఉద్యోగిని మధ్యవర్తిగా ఉంచి భారీగా నగదు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. చివరకు టీడీపీ ఓటమి కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తులకు ప్రధాన కార్యాలయంలో పోస్టింగ్‌లపై సర్వత్రా విస్మయం వ్యక్తమౌతుంది. కొందరు ఎమ్మెల్యేలు ఇచ్చిన సిఫార్సు లేఖలు బుట్టదాఖలు చేశారన్న విమర్శలున్నాయి. గోప్యంగా జరిగిన బదిలీల ప్రక్రియలో జాబితాలను మళ్లీమళ్లీ మార్చినట్లు సమాచారం. బదిలీల సమయంలో అప్పటివరకు దూరప్రాంతంలో పనిచేసిన ఉద్యోగులు, అధికారులు జిల్లా కేంద్రానికి దగ్గరకు రావడానికి ఇష్టపడతారు. జడ్పీ బదిలీల్లో మాత్రం అందుకు విరుద్ధంగా గడచిన ఐదేళ్ల నుంచి గుంటూరులో తిష్ఠ వేసిన వారికి మళ్లీ ఇక్కడే ఉండే అవకాశం దక్కింది. డిప్యూటీ సీఈవో కొందరు ఏవోల కోసం ఉనికిలో లేని జీవోలను బయటకు తెచ్చినట్లు చెబుతున్నారు. వాటి ఆధారంగానే నాడు వైసీపీకి కన్ను, కాళ్ళు, చెవుల్లా పనిచేసిన వ్యక్తులను మళ్లీ అందలం ఎక్కించినట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో పెదాకాకాని ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న ఓ అధికారి టీడీపీ అభ్యర్థిగా ఉన్న ధూళిపాళ్ల నరేంద్రకు వ్యతిరేకంగా పనిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో నరేంద్ర కూడా సదరు అధికారిపై ఫిర్యాదు చేశారు. ఈ బదిలీ లో ఆయనను జడ్పీ ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు. అందుకోసం రూ2 లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావుకు ఓటును ఓ తహసీల్దార్ తిరస్కరించారు. సదరు తహసీల్దారు భర్త జడ్పీలో ఏవోగా ఉన్నారు. ప్రస్తుత బదిలీలో ఆయనను జిల్లా కేంద్రానికి దగ్గరలోని పెదాకాకానికి మార్చారు. పెదాకాకానిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగిని అక్కడే ఉంచమని ఎమ్మెల్యే నరేంద్ర లేఖ ఇచ్చినా దానిని పట్టించుకోకుండా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పీఏగా పనిచేసిన వ్యక్తిని ఆ స్థానానికి బదిలీ చేశారు. పెదాకాకాని సీనియర్ అసిస్టెంట్ విషయంలోనూ అదే జరిగింది. సదరు ఉద్యోగి విభిన్న ప్రతిభావంతులైనా కనికరం లేని జడ్పీ అధికారులు ఎమ్మెల్యే లేఖను లెక్క చేయకుండా బదిలీ చేశారు. తాడికొండ ఎమ్మెల్యే ఫిరంగిపురంలో ఉన్న ఓ ఉద్యోగికి లేఖ ఇచ్చినా అమరావతికి పంపారు. ఎమ్మెల్యే నరేంద్ర సొంత గ్రామానికి చెందిన ఓ ల్యాబ్ అసిస్టెంట్‌ను కూడా ఇష్టానుసారంగా బదిలీ చేశారు. జడ్పీ కార్యాలయ ఏవోల బదిలీలకు సంబంధించి ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు ఇచ్చిన లేఖలకు సరైన ప్రాధాన్యం దక్కలేదని సమాచారం. ఆయన పరిధిలోని గుంటూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయానికి కూడా వైసీపీకి అనుకూలంగా ముద్ర పడిన ఓ అధికారిని బదిలీ చేశారు. ఈ పోస్టు కోసం ఎమ్మెల్యే ఇచ్చిన లేఖను బుట్టదాఖలు చేశారు.

ఏకాభిప్రాయంతో ఇచ్చినా పట్టించుకోలేదు..

జడ్పీ ఇన్‌చార్జి సీఈవోకు పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు పలుమార్లు ఫోన్ చేసి తొమ్మిది మంది ఏవోల బదిలీ విషయంలో కీలకమైన సూచనలు చేసినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యేలు మిగిలిన వారితో మాట్లాడి ఏకాభిప్రాయంతో ఓ జాబితా తయారు చేసి పంపారు. ఆ జాబితా కూడా ఇన్‌చార్జి సీఈవో పక్కన పెట్టేశారని బదిలీల జాబితాను చూస్తే అర్థమవుతుంది. ఓ సీనియర్ ఎమ్మెల్యే, లక్ష్మీనారాయణ అనే అధికారి కోసం ఫోన్ చేసినా ఆయనకు పోస్టింగ్ ఇవ్వలేదు. వైసీపీ భక్త బృందానికి ఆయా ప్రదేశాల్లో పోస్టింగ్ ఇచ్చేందుకు పలు కారణాలు చెప్పిన అధికారులు ఎమ్మెల్యేల మాటలను తుంగలో తొక్కేశారన్న విమర్శలున్నాయి.

ఎంత వస్తే అంత..

జడ్పీ బదిలీల వ్యహారమంతా అవినీతి మయమైందన్న ఆరోపణలున్నాయి. ప్రతి పోస్టుకి రేటు కట్టి వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. ఏవో పోస్టుకి ఒక రేటు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులకి మరో రేటు అన్న పద్ధతిలో బదిలీల ప్రక్రియ జరిగినట్లు సమాచారం. ఓ అధికారి వద్ద ఉన్న కింద స్థాయి ఉద్యోగి నగదు వసూలు చేసినట్లు తెలుస్తోంది. కొందరు ఉద్యోగులు ఈ సంభాషణలను ఆడియో, వీడియో రికార్డు కూడా చేసినట్లు తెలుస్తుంది. ఓ వ్యక్తి వద్ద బదిలీ కోసం రూ.3 లక్షలు పుచ్చుకున్నారని తెలిసింది. ఇదే ఉద్యోగి తాను పనిచేసే అధికారి పేరు చెప్పి చివరకు అటెండర్ల వద్ద కూడా రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. జడ్పీ చరిత్రలో బదిలీల వ్యవహారంలో ఎప్పుడూ జరగనంత గందరగోళం ఇప్పుడు జరిగినట్లు సమాచారం. వైసీపీకి అనుకూలం అన్న అధికారి ఈ బదిలీల్లో ప్రధాన పాత్ర పోషించడంతో మొత్తం ప్రక్రియ ఆరోపణలమయంగా మారింది.

పదవుల పండుగ

- ఉమ్మడి గుంటూరుకు ప్రాధాన్యం
- పోరాడిన వారికి అధిష్ఠానం గుర్తింపు
- పిల్లి మాణిక్యాలరావుకు లిడ్‌కాప్ చైర్మన్
- పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్‌గా అబద్ధయ్య

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం పలు కార్పొరేషన్ల పాలక మండళ్లను నియమించింది. తొలి విడతగా విడుదల చేసిన జాబితాలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలువురు నేతలు కీలక పదవులు పొందారు. కష్టకాలంలో పార్టీ కోసం పని చేసిన వారికి, సేవలందించిన వారికి అండగా నిలుస్తామని తాజా పదవుల ఎంపికతో చంద్రబాబు నేతల్లో భరోసా కల్పించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావుకు లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(లిడ్‌కాప్) చైర్మన్, టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్యకు ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా కూటమి ప్రభుత్వం ఎంపిక చేసింది. వీరితో పాటు పలువురు నేతలకు వివిధ కార్పొరేషన్లలో సభ్యులుగా కీలక బాధ్యతలు అప్పగించింది. ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ సభ్యులుగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన రాయపాటి శైలజ, మంగళగిరికి చెందిన తోట పార్థసారథి, తెనాలికి చెందిన కేశన కోటేశ్వరరావులకు అవకాశం కల్పించింది. రాయపాటి శైలజ అమరావతి ఉద్యమంలో మహిళా నేతగా కీలక భూమిక పోషించగా, పార్థసారథి, కోటేశ్వరరావులు మంగళగిరి, తెనాలిలో కీలక బాధ్యతలు నిర్వహించారు. పద్మశాలీ కార్పొరేషన్‌లో సభ్యులుగా మంగళగిరికి చెందిన కందుల నాగార్జున, పర్వతం మధుసూదనరావు, తెనాలికి చెందిన జొన్నాదుల మహేశ్వరరావు, తాడికొండకు చెందిన బిట్రా వెంకట శివ నారాయణ నియమితులయ్యారు. జనసేన పార్టీలో చేనేత వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పర్వతం మధుసూదనరావు పని చేస్తున్నారు. ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన టీడీపీ నేత కుర్రా అప్పారావు నియమితులయ్యారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన దాసరి రాజా మాస్టారు, జనసేనకు చెందిన వడ్రాణం మార్కండేయబాబు నియమితులయ్యారు. దాసరి రాజా మాస్టారు గతంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

అలుపెరుగని పోరాటాలే వరం..

అలుపెరుగని పోరాటాలే నేడు పిల్లి మాణిక్యాలరావుకు వరాలుగా మారాయి. ఆయన పోరాటాలను గుర్తించిన చంద్రబాబు లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని అప్పగించి గౌరవించారు. ప్రకాశం జిల్లా చీరాల మండలం కారంచేడు గ్రామానికి చెందిన దళిత కుటుంబంలో జన్మించిన మాణిక్యాలరావు 1986లో జరిగిన కారంచేడు ఘటనలో బాధితుడు. మందకృష్ణ మాదిగతో కలిసి ఎంఆర్పీఎస్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన మొదలు ఈరోజు వరకూ 25 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ చరిత్ర ఆయనది. ఉద్యమాన్ని ఎంతో ముందుకు తీసుకెళ్లిన క్రమంలో ఆయన ఎంఆర్‌పీఎస్‌కు జాతీయ అధ్యక్షుడి స్థానాన్ని సొంతం చేసుకున్నారు. కొన్ని అంతర్గత కారణాలతో రాజీనామా చేసిన మాణిక్యాలరావు 2017లో టీడీపీలో చేరారు. 2019లో రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. 2019లో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి తనదైన పోరాట పంథాలో ఆయన కొనసాగారు. ఏ చిన్న సమస్య వచ్చినా అక్కడ ప్రత్యక్షమై వైసీపీ ప్రభుత్వం మీద అలుపెరుగని పోరాటం చేశారు. అధికార ప్రతినిధి హోదాలో మీడియా చర్చల్లో తన వాణిని, పార్టీ వైఖరిని బలంగా వినిపిస్తూ వైసీపీ వైఫల్యాలను, దుర్మార్గాలను ప్రజల్లో ఎండగట్టారు. 2021 ఆగస్టు 15న గుంటూరు మంగళదాస్‌నగర్‌లో రమ్య అనే దళిత విద్యార్థిని హత్య ఘటనపై పోరాటం, పరామర్శకు వచ్చిన యువనేత లోకేశ్‌పై వైసీపీ మూకలు దాడికి పాల్పడినప్పుడు ధీటుగా ఎదుర్కొన్నారు. చంద్రబాబు, పట్టాభిపై దాడి, అరెస్టు సమయంలో ఉద్యమించారు. టీడీపీ నేతలను అరెస్టు చేసి గుంటూరులోని సీఐడీ ఆఫీసుకు తరలించిన సమయంలో అక్కడ ఆందోళనలు చేయడం, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం వంటి పోరాటాలకు నాయకత్వం వహించారు. 2024 ఎన్నికల్లో ఎస్సీ నియోజకవర్గమైన ప్రత్తిపాడు ఎమ్మెల్యే టికెట్ ఆశించగా అనూహ్య పరిణామాల నేపథ్యంలో ఆ సీటు విశ్రాంత ఐఏఎస్ బూర్ల రామాంజనేయులుకు దక్కింది. ఈ నేపథ్యంలో మాణిక్యాలరావుకు నామినేటెడ్ పదవిని అప్పగించి తగిన న్యాయం చేసింది.

అంకిత భావానికి గుర్తింపు

మంగళగిరి: టీడీపీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో పార్టీనే అంటిపెట్టుకున్న నందం అబద్ధయ్యను ఏపీ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించింది. టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త అబద్ధయ్య మంత్రి నారా లోకేశ్‌కు కుడి భుజంగా పనిచేస్తున్నారు. సౌమ్యుడు, వివాద రహితుడిగా పేరొందిన అబద్ధయ్యకు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల్లో తొలి ప్రాధాన్యం లభించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. చేనేత సామాజిక వర్గానికి చెందిన అబద్ధయ్య 1983లో టీడీపీ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి అంచలంచెలుగా ఎదిగారు. 1984 నుంచి 1994 వరకు 21వ వార్డు అధ్యక్షుడిగా పనిచేశారు. 1999 నుంచి మూడేళ్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, 2005లో 24వ వార్డు టీడీపీ కౌన్సిలర్‌గా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 2015 నుంచి 2021 వరకు ఉమ్మడి గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులుగా పనిచేసిన ఆయన 2022 నుంచి మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా కొనసాగుతున్నారు. రాజకీయంగా ఎన్నో ఆటుపోట్లను చవిచూచిన అబద్ధయ్య 74 ఏళ్ల వయస్సులోనూ విలువలతో కూడిన రాజకీయ విధానాలను అవలంబిస్తూ యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

వరద బాధితులకు పార్ట్‌టైం టీచర్ల విరాళం


సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న పార్ట్‌టైం టీచర్లు

తాడికొండ, సెప్టెంబరు 24: వరద బాధితులను ఆదుకోవటానికి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల పార్ట్‌టైం టీచర్లు ముందుకు వచ్చారు. వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష డీడీ తీసి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోచిపాతల నవీన్‌కుమార్, రాష్ట్ర నాయకులు గురురత్నం, వర్మ, ఇస్మాయిల్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్‌గా నాదెండ్ల రామారావు



తాడికొండ, సెప్టెంబరు 24: జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్‌గా చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు ఎంపికైనట్లు చలపతి విద్యాసంస్థల ఛైర్మన్ వై.వి.ఆంజనేయులు పేర్కొన్నారు. ఫార్మసీ వృత్తిలో అత్యుత్తమ సేవలు అందించినందుకుగానూ అసోసియేషన్ ఆఫ్ ఫార్మస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా(ఏపీటీఐ) జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు రామారావును ఎంపిక చేసిందని చెప్పారు. ఈ నెల 27, 28 తేదీల్లో ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ఏపీటీఐకో-2024 సదస్సులో అవార్డును స్వీకరించనున్నట్లు తెలిపారు. ఫార్మసీ విద్య, పరిశోధనా రంగంలో 33 ఏళ్ల అనుభవంతోపాటు 500 పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించి 14 పుస్తకాలు రచించి 4 పేటెంట్లును సొంతం చేసుకున్నారని వివరించారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యునిగా నాణ్యమైన ఫార్మసీ విద్య కోసం ఎన్నో నూతన ఆవిష్కరణలను చేశారని చెప్పారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు రావటంతో చలపతి విద్యా సంస్థల సెక్రటరీ వై.సుజిత్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

ఆరు రైళ్ల రద్దు

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇన్‌ఫ్రాస్ట్రక్చరల్ మెయిన్‌టెనెన్స్ వర్కులు కారణంగా ఆరు రైళ్లను కొన్ని రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ మంగళవారం తెలిపారు. నంబరు 17201 గుంటూరు - సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ అక్టోబరు 7వ తేదీ వరకు, నంబరు 17202 సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ అక్టోబరు 8వ తేదీ వరకు, నంబరు 12706 సికింద్రాబాద్ - గుంటూరు ఇంటరషిటీ, నంబరు 12705 గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని అక్టోబరు 2వ తేదీ వరకు, నంబరు 07464 విజయవాడ - గుంటూరు, నంబరు 07465 గుంటూరు - విజయవాడ రైళ్లను అక్టోబరు 7వ తేదీ వరకు రద్దు చేశామన్నారు.

ఏటా రూ.100 కోట్ల వసూలు లక్ష్యం

- ఇది ఏడాదికి 20 శాతం చొప్పున పెరగాలి
- ప్రతీ మిర్చి టిక్కీకి మార్కెట్ ఫీజు వసూలు చేయాలి
- జీరో బిజినెస్ జరగడానికి వీల్లేదు
- మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత ఆదేశాలు



గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'మిర్చియార్డులోకి అమ్మకానికి వచ్చిన ప్రతీ మిర్చి టిక్కీ లెక్కలోకి రావాల్సిందే. ఏ ఒక్కటీ మార్కెటింగ్ ఫీజు చెల్లించకుండా బయటకు వెళ్లడానికి వీల్లేదు. జీరో బిజినెస్‌కి పూర్తిగా అడ్డుకట్ట వేయాలి' అని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీత ఆదేశించారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె తొలిసారిగా మంగళవారం సాయంత్రం ఎన్టీఆర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు) సందర్శనకు వచ్చారు. ఈ సందర్భంగా యార్డులో కార్యకలాపాలను పరిశీలించి పరిపాలన భవనంలో మార్కెటింగ్ జేడీలు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, డీడీ ఝాన్సీరాణితో సమావేశం నిర్వహించారు. పలువురు గ్రేడ్-3, 2 సెక్రెటరీలు, సూపర్‌వైజర్లను కూడా పిలిపించి మాట్లాడారు. అన్ని విషయాలను లోతుగా సమీక్షించారు.

కోల్డ్‌స్టోరేజ్‌లలో 47 లక్షల మిర్చి టిక్కీలు నిల్వ

ఈ సందర్భంగా కమిషనర్ విజయ సునీత మాట్లాడుతూ ఏడాదికి రూ. 100 కోట్ల మార్కెట్ ఫీజు వసూలు లక్ష్యంగా ఉందన్నారు. ఇది ఏటా 20 శాతం పెరుగుతుందన్నారు. మిర్చి లావాదేవీలకు యార్డు కేంద్ర బిందువుగా ఉందనీ, ఇక్కడికి ఇతర జిల్లాలు, వేరే రాష్ట్రాల నుంచి రైతులు మిర్చిని తీసుకువస్తారని చెప్పారు. ప్రస్తుతం అన్‌సీజన్ కావడం వలన రోజుకు 20 వేల టిక్కీలు విక్రయం జరుగుతున్నాయి, రకాన్ని బట్టి క్వింటాల్‌కు రూ.10 వేల నుంచి రూ. 18,500 వరకు ధర లభిస్తుందని అన్నారు. గత సీజన్‌లో ఎక్కువగా దిగుబడి రావడం వలన కోల్డ్‌స్టోరేజ్‌లలో 47 లక్షల మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. వీటిని సాధ్యమైనంత త్వరగా ఎగుమతి చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం ఎగుమతిదారులతో ప్రత్యేకించి సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామన్నారు. లేకుంటే మరో రెండు, మూడు నెలల్లో కొత్త స్టాకు వచ్చి రేటు పడిపోయే ప్రమాదం ఉందన్నారు.

వినుకొండ వైద్యశాలలో తనిఖీ

వినుకొండ, సెప్టెంబరు 24: మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కిందకు వస్తాయని, జిల్లా వ్యాప్తంగా ఉన్న నెట్ వర్కు వైద్యశాల్లో పేదలకు ఉచితంగా వైద్యం అందుతుందని పల్నాడు జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా చికిత్స పొందిన రోగుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయాలని రోగులకు సూచించారు. వైద్యశాలకు వచ్చేటప్పుడు ఆరోగ్యశ్రీకార్డు తీసుకుని వచ్చి హెల్ప్ డెస్క్ దగ్గర పేరు నమోదు చేసుకుని ఉచితంగా పరీక్షలు చేయించుకుని రోగ నిర్ధారణ అయిన వెంటనే ఆస్పత్రిలో చేరి అన్ని రకాల శస్త్రచికిత్సలు పొంది ఆరోగ్యంగా బయటకు వెళ్లవచ్చని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఎవరైనా డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలన్నారు. ఆయన వెంట డాక్టర్ రజాక్, వైద్యమిత్ర మాచర్ల బుజ్జి, టీమ్ లీడర్ ప్రశాంతి, డీఈవో సాగర్, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 24: పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 33,490 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద ఒక గేటు ద్వారా 36,950 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయి. వీటిలో 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణానదికి వస్తున్నాయి.

విద్యుత్‌శాఖలో ఈఈల బదిలీలు

గుంటూరు, సెప్టెంబరు 24: సాధారణ బదిలీల్లో భాగంగా ఏపీ సీపీడీసీఎల్ పరిధిలోని గుంటూరు, సీఆర్‌డీఏ సర్కిల్స్ పరిధిలో పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)లను బదిలీ చేస్తూ సీఎండీ పి.రవి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సీఆర్‌డీఏ సర్కిల్‌తో పాటు గుంటూరు సర్కిల్‌ను మూడు సర్కిల్స్‌గా విభజిస్తూ బదిలీలు చేశారు. గుంటూరు సర్కిల్ పరిధిలో ఉన్న పల్నాడు, బాపట్ల జిల్లాలను కూడా పల్నాడు, బాపట్ల సర్కిల్స్‌ను ఏర్పాటు చేస్తూ బదిలీ ప్రక్రియ నిర్వహించారు. ఈ బదిలీల్లో గుంటూరు సర్కిల్‌లోని గుంటూరు టౌన్ -1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, సీఆర్‌డీఏలోని గుంటూరు-2 ఈఈ రమేష్‌బాబు, చీరాల ఈఈ కె.జాన్‌థామస్, అద్దంకి ఈఈ ఎన్.మస్తాన్‌రావు, బాపట్ల ఈఈ ఆంజనేయులు, గుంటూరు కన్‌స్ట్రక్షన్స్ ఈఈ ఎమ్ శ్రీనివాసబాబులను వారి వారి స్థానాల్లోనే కొనసాగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వారితో పాటు పలువురు డిప్యూటీ ఈఈలు, ఏఈలు, వివిధ కేటగిరీల ఉద్యోగులను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

గుంటూరు సర్కిల్‌లో ఈఈల బదిలీలు ఇలా...

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
కేవీఎల్ఎన్ మూర్తి	డీపీఈ/ ఈఈ	టెక్నికల్ ఈఈ, గుంటూరు
ఎమ్ శ్రీనివాసరావు	గుంటూరు కన్‌స్ట్రక్షన్‌ఈఈ	అదే స్థానం
సీహెచ్ వెంకటేశ్వరరావు	ఎంఆర్‌టీ, గుంటూరు	డీపీఈ, ఈఈ, గుంటూరు
కె సూర్యప్రకాష్	డీపీఈ, ఈఈ, గుంటూరు	ఎంఆర్‌టీ, ఈఈ, గుంటూరు
టి శ్రీనివాసబాబు	గుంటూరు టౌన్-1	అదే స్థానం
టీవీ తులసీరామ్	అమరావతి, ఈఈ	తెనాలి
బాపట్ల సర్కిల్‌లో...		
జి ఆంజనేయులు	బాపట్ల, ఈఈ	అదే స్థానం
ఎన్ సింగయ్య	ఎం, పీ-1, గుంటూరు, ఈఈ	ఈఈ, కన్‌స్ట్రక్షన్స్, బాపట్ల
వీవీ చిరంజీవి	ఈఈ, తెనాలి	ఎంఆర్‌టీ, ఈఈ, బాపట్ల
ఎస్ఏ కరీమ్	ఈఈ, దర్శి	ఈఈ , డీపీఈ, బాపట్ల
పి నాగేశ్వరరావు	ఈఈ, ఎం, పీ-11, గుంటూరు	ఈఈ, టెక్నికల్, బాపట్ల
కె జాన్ థామస్	ఈఈ, చీరాల	అదే స్థానం
ఎన్ మస్తాన్‌రావు	ఈఈ, అద్దంకి	అదే స్థానం
పల్నాడు సర్కిల్ పరిధిలో...		
కె రామసుబ్బారావు	ఈఈ, కార్పొరేట్ ఆఫీస్	ఈఈ, టెక్నికల్, కన్‌స్ట్రక్షన్ పల్నాడు
జె శ్రీనివాసులరెడ్డి	ఈఈ, టెక్నికల్, గుంటూరు	ఈఈ ,ఎమ్ఆర్‌టీ, పల్నాడు
సీహెచ్ రామ్‌బొట్లు	ఈఈ, టెక్నికల్, సీఆర్‌డీఏ	ఈఈ, నరసరావుపేట
ఎమ్ భాస్కరరావు	ఈఈ , మచిలీపట్నం	ఈఈ, మాచర్ల
సీఆర్‌డీఏ సర్కిల్ పరిధిలో....		
జె హరిబాబు	ఈఈ, మాచర్ల	ఈఈ, టెక్నికల్, కన్‌స్ట్రక్షన్ సీఆర్‌డీఏ
ఎస్ శ్రీనివాసరావు	ఈఈ, నరసరావుపేట	ఈఈ, ఎమ్ఆర్‌టీ, సీఆర్‌డీఏ
సీహెచ్ రమేష్	ఈఈ, గుంటూరు టౌన్-2	అదే స్థానం
జె శ్రీనివాసరావు	ఈఈ, విజయవాడ - ఈఈ	ఈఈ, అమరావతి

సంక్షేమం.. అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, సెప్టెంబరు 24 : ప్రజా సంక్షేమం... అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపర పాల ఉత్పత్తిదారుల కల్యాణ మండపంలో జరిగిన కూటమి ప్రభుత్వం వంద రోజులు పరిపాలన, డ్వాక్రా రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి డీఆర్‌డీఏ ఏపీఎం ప్రియదర్శిని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో డ్వాక్రా మహిళలకు మండలంలో వంద కోట్లు రుణాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మహిళా రైతులకు ప్రతి మండలంలో డ్రోన్‌లు ఇచ్చే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డ్రోన్‌లు ద్వారా మహిళలు లక్ష రూపాయలు ఆదాయం పొందవచ్చునన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు రూ.24 కోట్లు చెక్కుల రూపంలో అందించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ గుమ్మడి సిద్ధార్థ, జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు, ఏడీఏ ఉషారాణి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి రవీంద్రబాబు, ఏవో వెంకట్రావు పాల్గొన్నారు.

భారత్‌లో జమిలి ఎన్నికలు సాధ్యం కాదు



ప్రసంగిస్తున్న డాక్టర్ తులసి రెడ్డి, పక్కన లక్ష్మణరావు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 24: భారతదేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదనీ, ఆవశ్యకత లేదని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ ఏపీ మీడియా కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసీ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో జమిలి ఎన్నికలు అవసరమా? సాధ్యమా? అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఎన్.తులసీరెడ్డి మాట్లాడుతూ జమిలి ఎన్నికలు నియంతృత్వానికి దారి తీస్తుందని, స్థానిక సమస్యల ప్రాధాన్యం తగ్గుతుందనీ, అవినీతి తారాస్థాయికి చేరుతుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐదేళ్లలో 500 లక్షల కోట్లు బడ్జెట్లలో వ్యయం చేస్తుంటే అందులో ఎన్నికల కోసం 10 వేల కోట్లు అనేది కేవలం 0.01 శాతం మాత్రమే అని తెలిపారు. మోడీ ప్రభుత్వం చెబుతున్నట్టుగా ఎన్నికలు విడివిడిగా జరగడం వలన అభివృద్ధికి నోచుకోలేకపోతున్నామనేది అర్థరహితం అన్నారు. శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ జమిలి ఎన్నికలు అమల్లోకి రావాలంటే రాజ్యాంగంలో ప్రధానంగా ఆరు సవరణలు చేయాలని అన్నారు. జమిలి ఎన్నికలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, బహు పార్టీ వ్యవస్థను, ఫెడరలిజాన్ని దెబ్బతీస్తుందని తెలిపారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ కోటిలోపు జనాభా ఉన్న 100 దేశాలు ప్రపంచంలో ఉన్నాయని, ఇలాంటి పరిస్థితులలో అత్యధిక జనాభా గల రాష్ట్రాలు భారతదేశంలో జమిలి ఎన్నికలు ద్వారా స్వయం ప్రతిపత్తిని కోల్పోతాయని అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ప్రముఖ విద్యావేత్త మేకల రవీంద్రబాబు, రాజ్యాంగ చర్చా వేదిక కన్వీనర్ అవధానుల హరి, నేస్తం సహ వ్యవస్థాపకులు టి.ధనుంజయ రెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు వినయ్ కుమార్ ప్రసంగించారు.

విద్యార్థులతో స్నేహంగా మెలగాలి

బోయపాలెం(యడ్లపాడు), సెప్టెంబరు 24 : కుటుంబ సభ్యులకు దూరంగా విద్యనభ్యసించేందుకు వచ్చిన విద్యార్థుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి సూచించారు. మండలంలోని బోయపాలెం పరిధిలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. ముందుగా వంటగదిని, అక్కడి సరుకుల నాణ్యతను పరిశీలించారు. మధ్యాహ్నం విద్యార్థులకు అందించిన రాగిజావను పరిశీలించగా, వాసన వస్తుండడంతో, స్టాక్ రూంను పరిశీలించారు. గడువు ముగిసిన 40 కేజీల రాగి పిండి ప్యాకెట్లు దర్శనమిచ్చాయి. స్టాక్ రిజిష్టర్లు చూపించాలని ప్రిన్సిపాల్ హనుమంతరావును కోరగా రికార్డులు లేవని, కేవలం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని చెప్పారు. దీంతో స్టాకు రిజిష్టర్లు ఫిజికల్‌గా లేకపోవడం ఏమిటని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులను దండించకూడదని చట్టాలు చెబుతున్నా, మీరు ఎందుకు కొడుతున్నారని, క్లాస్ రూంకు బెత్తాలు తీసుకురాకూడదని మీకు తెలియదా అని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. ఫిర్యాదుల పెట్టె ఎందుకు పెట్టలేదని ప్రశ్నించిన ఆమె విద్యార్థులకు అందుబాటులో ఫోన్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ బాలల కమిషన్ సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేస్తుందనీ, ప్రిన్సిపాల్‌కు మెమో జారీ చేయాలని డీసీవోను ఆదేశించినట్లు చెప్పారు. తహసీల్దార్ విజయశ్రీ, ఎంఈవో నాగరత్నం, ఏసీడీపీవో బి.నిర్మలారాణి, ఎస్సై బాలకృష్ణ ఉన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

యడ్లపాడు, సెప్టెంబరు 24: గురుకుల పాఠశాల విద్యార్థులకు సంబంధించిన విషయంపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్, ఏపీ ప్రైవేట్ టీచింగ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యడ్లపాడు మండలం బోయపాలెం పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలను వారు మంగళవారం సందర్శించారు. విద్యార్థులు పాఠశాల నుంచి పరారవడంపై ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏఐవైఎఫ్, ప్రైవేటు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు బి.శ్రీనునాయక్, చెన్నకేశవులు, రాంబాబు, నాగరాజు, వెంకట నగేష్, వెంకట బుల్లోడు, లెనిన్‌బాబు, చిన్న, రాంబాబు నాయక్, వెంకట్ ఉన్నారు.

సీఈవోగా జ్యోతిబసు బాధ్యతల స్వీకరణ



గుంటూరు సిటీ, సెప్టెంబరు 24 : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సీఈవోగా వి.జ్యోతిబసు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కృష్ణా జిల్లా సీఈవోగా పనిచేసిన ఆయన్ను ప్రభుత్వం గుంటూరు బదిలీ చేసిన విషయం విదితమే. బాధ్యతలు స్వీకరించిన తర్వాత జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా ను మర్యాద పూర్వకంగా కలిశారు. జడ్పీ ఛైర్ పర్సన్ దంపతులు నూతన సీఈవో కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సీఈవో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని కలిశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు, ఏసీ హాల్ ఇన్‌చార్జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

27న జాబ్‌మేళా

గుంటూరు(విద్య),సెప్టెంబరు 24: ఈనెల 27న నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పిన్నెంటి ప్రణయ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలా అగ్రిసర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్, వయసీర్ ఆటోమోటివ్స్, కేఎల్‌గ్రూపు అమెజాన్ వేర్‌హౌస్, వేటూ న్యూస్, మాస్టర్‌మైండ్స్ తదితర సంస్థలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని తెలిపారు. పది నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసి 18 నుంచి 35 ఏళ్ల వయసు ఉన్నవారు అర్హులని తెలిపారు. జాబ్‌మేళా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మణిపురం ఫ్లైవోర్ కింద, అశ్విని హాస్పటల్ ఎదురు, గుంటూరు, సాంఘిక సంక్షేమ శాఖ బాలురు వసతి గృహం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురు, అమరావతి రోడ్డు, తూళ్లూరులో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. వివరాల కోసం డి.నరేష్(9866366187), ఎ.వెంకటరావు(9505719172)లో సంప్రదించాలని సూచించారు.

బైకుల చోరీ కేసులో నిందితుడు అరెస్టు


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కొల్లిపర, సెప్టెంబరు 24: బైకుల చోరీ కేసులో ముద్దాయిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి ఆరు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పోలీసుస్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొల్లిపరకు చెందిన అమిరే ఆనందకిషోర్ 2022 నుంచి దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడు. అనేక కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చి మళ్లీ చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. గుంటూరులో రెండు బైకులు, తెనాలిలో రెండు బైకులు, కొల్లిపరలో రెండు బైకులు దొంగతనం చేసినట్లు తెలిపారు. కొల్లిపర ఎస్ఐ కోటేశ్వరరావు, ఏఎస్ఐ పోతురాజు ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో గత సోమవారం రాత్రి కొల్లిపర మండలంలోని దావులూరు అడ్డరోడ్డు వద్ద ముద్దాయిని అరెస్టు చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ: వ్యక్తి మృతి

నకరికల్లు, సెప్టెంబరు 24: అద్దంకి - నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువన రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నకరికల్లుకు చెందిన కేలం రామకృష్ణ(41) పిడుగురాళ్లలో గోతాల కంపెనీలో పని చేసేందుకు రోజూ వెళ్తుంటాడు. సోమవారం కూడా నకరికల్లు నుంచి పిడుగురాళ్లకు పని చేసేందుకు వెళ్లాడు. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో తన భార్య సత్యవేణికి ఫోన్ చేసి ఈ రోజు పని ఎక్కువగా ఉంది, సమయం దాటితే బస్సులు ఉండవు, ఉదయాన్నే వస్తానని చెప్పాడు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పిడుగురాళ్ల నుంచి రామకృష్ణ నకరికల్లుకు వచ్చాడు. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై దిగి రోడ్డు దాటి ఊర్లోకి వచ్చే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకుంది. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సత్యవేణి ఫిర్యాదు మేరకు నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణానదిలో పడి మహిళ మృతి


మంగమ్మబాయి (ఫైల్ ఫొటో)

దాచేపల్లి, సెప్టెంబరు 24: కృష్ణానదిలో నీళ్లు తాగేందుకు వెళ్లి ఒడ్డుకు రాలేక ఇబ్బంది పడుతున్న గేదెను కాపాడబోయి ప్రమాదవశాత్తూ మహిళ నదిలో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని భట్రుపాలెం గ్రామం వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దాచేపల్లి మండలం భట్రుపాలెం గ్రామంలో కేతావత్ మంగమ్మబాయి(43) గేదెలను కృష్ణానది ఒడ్డున మేపేందుకు వెళ్లింది. గేదె ఒకటి నదిలోకి దిగి నీళ్లు తాగుతూ నదిలోనే ఆగింది. ఆ గేదెను ఒడ్డుకు తీసుకొచ్చేందుకు వెళ్లిన మంగమ్మబాయి ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందింది. మృతురాలికి భర్త అమృనాయక్, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సంఘటన గురించి తెలుసుకున్న స్థానికులు మృతదేహాన్ని నది ఒడ్డుకు చేర్చారు.

రైలు కింద తల పెట్టి బలవన్మరణం



తెనాలి క్రైం, సెప్టెంబరు 24: కదులుతున్న రైలు కింద తల పెట్టి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలోని మొండిగోడల వద్ద మంగళవారం జరిగింది. తెనాలి ఆర్‌పీఎఫ్ ఎస్ఐ జి.వెంకటాద్రి తెలిపిన వివరాల ప్రకారం సుమారు 55 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి స్టేషన్ సమీపంలోని మొండిగోడల వద్ద ట్రాక్ పక్కగా నిలబడి ఎదురుగా వస్తున్న రైలు కింద ఒక్కసారిగా తలపెట్టి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుని వద్ద ఎలాంటి వ్యక్తిగత సమాచారం లభించలేదు. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్ఎస్‌పీ కాలువలో కొట్టుకుపోయి యువకుడు మృతి

సత్తెనపల్లి, సెప్టెంబరు 24: వినాయక నిమజ్జనంలో ఎన్ఎస్‌పీ కాలువలో ఇద్దరు యువకులు గల్లంతు కాగా, ఒకరిని స్థానికులు కాపాడారు. లక్కరాజుగార్లపాడులోని గుంటూరు బ్రాంచ్ కాలువ వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వడ్డవల్లి పీర్లచావిడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనోత్సవానికి లక్కరాజుగార్లపాడులోని ఎన్ఎస్‌పీ కాలువ వద్దకు భక్తులు, కమిటీ సభ్యులు ఊరేగింపుగా తీసుకెళ్లారు. పీర్లచావిడి ప్రాంతానికి చెందిన రఫీ, తిరుపతిరావు ఈత కొట్టేందుకు కాలువలోకి దూకారు. కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రఫీ కొట్టుకు పోగా తిరుపతిరావును స్థానికులు కాపాడారు. ఎన్ఎస్‌పీ అధికారులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కాలువ నీటిని నిలుపుదల చేయించి గల్లంతైన రఫీ కోసం గాలింపు చేపట్టారు. ఎన్ఎస్‌పీ కాలువలో కొట్టుకుపోయిన రఫీ మృతదేహం లభించింది.

కారు ఢీ: వ్యక్తి మృతి

బాపట్ల,సెప్టెంబరు 24 : ఏరియా వైద్యశాల ఔట్‌పోస్ట్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం కర్లపాలెం రోడ్డులో డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఎదురు నేషనల్ హైవే రోడ్డుపై స్కూటీపై వెళుతున్న దేవరకొండ వెంకటేశ్వరరావు (35) పార్వతి దంపతులను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది.స్థానికులు వారిని ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే వెంకటేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య పార్వతికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

46,245 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 48,267 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 46,245 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 24,264 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16500	334	9000	16500
నెంబరు. 5	9500	14500	నెంబరు. 5	10000	15500
273	9000	14000	273	9500	10000
341	9000	15500	341	9500	16500
4884	13000	13500	4884	10000	13600
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	18600	తేజ	9500	18500
బ్యాడిగి	9000	15000	బ్యాడిగి	9000	15000
దేవనూరు డీలక్స్	9000	15500	దేవనూరు డీలక్స్	10500	16500
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	10500

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ

సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలి

● జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

గుంటూరు(విద్య), సెప్టెంబరు 24 : విద్యార్థులు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ పిలుపునిచ్చారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని యూఈఏసీ (యూనివర్సిటీ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీ కౌన్సిల్) విద్యార్థుల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్‌డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భార్గవ్ తేజ మాట్లాడుతూ విద్యార్థులందరూ సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించడానికి కృషి చేయాలన్నారు. యూనివర్సిటీ పరిధిలోని 5 గ్రామాలను (శలపాడు, వడ్లమూడి, వీరనాయకునిపాలెం, వేజండ్ల, సుద్దపల్లి) దత్తత తీసుకుని సంవత్సర కాలంలో 107 సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ సమీప ప్రాంతాల్లోని ప్రజలకు విద్య, ఆరోగ్యం, కాలుష్యం సమస్యలను పరిష్కరించడం, సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎమ్మెస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్స్, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న జేసీ భార్గవ తేజ

ఆర్‌వీఆర్ జేసీలో 'స్వర్ణాంధ్ర 2047' పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు(విద్య), సెప్టెంబరు 24 : స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీలో 'స్వర్ణాంధ్ర 2047' కార్యక్రమ లక్ష్య సాధనపై మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వర్ణాంధ్ర 2047' సాధనలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తూ మహిళా సాధికారత, మెరుగైన విద్య, మేలైన వైద్యం, వ్యవసాయం, పారిశ్రామికం తదితర రంగాలలో ఆర్థిక వృద్ధి సాధనకై అన్ని వర్గాల అభిప్రాయాలను, సలహాలను, సూచనలను సేకరించే క్రమంలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్, కె.మద్దినేని, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వి శ్రీనివాసరావు, డిప్యూటీ ఏఎస్ఓ శ్రీనివాసరావు, ఏఎస్ఓ సుబ్బారావు, కళాశాల మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ డీవీవీ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.


పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న విద్యార్థులు, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు

లివర్ వ్యాధులను తొలి దశలో గుర్తిస్తే మేలు

● డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు

గుంటూరు, సెప్టెంబరు 24: గోరంట్ల ఇన్నర్ రింగ్‌రోడ్డు, భాష్యం రామసేతు క్యాంపస్ వెనుక ఉన్న శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పటల్ ఆధ్వర్యంలో మంగళవారం లివర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మందికి ఉచితంగా రక్త పరీక్షలు చేసి లివర్ పనితీరుతో పాటు నాడీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయుర్వేద మందులు అందించారు. హాస్పటల్ చీఫ్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లివర్ నుంచి వచ్చే ప్రాణాంతక వ్యాధులను మొదలులోనే గుర్తించి వెంటనే మందులు వినియోగిస్తే ప్రాణాంతకం కాకుండా నివారించవచ్చన్నారు. లివర్ వ్యాధులకు ఆయుర్వేద మందులు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా సంపూర్ణంగా పని చేస్తాయన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదైన 100కు పైగా బెడ్స్ ఉన్న ఆయుర్వేదిక్ సూపర్ స్పెషాలిటీస్ అయిన శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద వైద్యశాల (కేరళ) వారి అనుబంధంతో మంచి నాణ్యమైన మందులతో కేరళ పంచకర్మ వైద్యంతో అందిస్తున్నామన్నారు. శిబిరంలో డాక్టర్ భాను కాశ్యప్, డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ రాహుల్, మేనేజర్ మల్లీశ్వరి తదితరులున్నారు.



లివర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు

యూనియన్ బ్యాంకు ఉద్యోగుల నిరసన ప్రదర్శన

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 24 : తమ 20 డిమాండ్ల సాధనకై జిల్లాలోని యూనియన్ బ్యాంకు ఉద్యోగులు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అఖిల భారత యూనియన్ బ్యాంక్ అధికారుల ఫెడరేషన్, అఖిల భారత యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు ప్రాంతీయ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. యూనియన్ బ్యాంకు ఉద్యోగుల యూనియన్ నేతలు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యూనియన్ బ్యాంక్ అధికారుల ఫెడరేషన్ ప్రాంతీయ కార్యదర్శి మాదాల రాంబాబు, ఉప కార్యదర్శి పొదిలి కళ్యాణ్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ ఉపాధ్యక్షులు బాషా, క్రాంతి, రీజినల్ సెక్రటరీ వేణుబాబు, పెద్ద సంఖ్యలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.



యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఉద్యోగులు

క్రిస్టియన్ భవన్ నిర్మాణానికి నిధులివ్వడం హర్షణీయం: మద్దిరాల

గుంటూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు క్రిస్టియన్ భవన్ కోసం మరోమారు రూ.10 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించడం సంతోషకరమని క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల ఇమ్మానుయేల్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో క్రిస్టియన్ భవన్ నిర్మాణం కోసం గుంటూరులో 2 ఎకరాల భూమి కేటాయించి రూ.16 కోట్ల నిధులు విడుదల చేసి 90 శాతం భవన నిర్మాణ పనులు పూర్తి చేసారని, వైసీపీ ప్రభుత్వం రావడంతో క్రిస్టియన్ భవన్ నిర్మాణం ఆగిపోయిందని, మిగిలిపోయిన 10 శాతం పనులు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. మళ్లీ చంద్రబాబు హయాంలోనే దానికి మోక్షం కలిగిందన్నారు. సమావేశంలో బురదగుంట వెంకటరావు, కారంగి అనీల్ కుమార్, బొబ్బిలి రామారావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తికరంగా కూటమి పరిపాలన: సుభాన్ సాహెబ్

గుంటూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలు మెచ్చే విధంగా పాలన సాగిస్తోందని టీడీపీ నూర్ బాషా సాధికార రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్ సాహెబ్ అన్నారు. హజ్ యాత్రకు వెళ్లేవారికి రూ. లక్ష, ప్రతి మసీదు నిర్వహణకు నెలకు రూ.5 వేలు, మౌజనులకు రూ.5 వేలు, ఇమాములకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ లాల్ వజీర్ మాట్లాడుతూ మైనార్టీలకు మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీలు అమలు చేస్తున్న సీఎంకి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో హుస్సేన్, షేక్ ఆదం షఫీ, షేక్ శీనావలి పాల్గొన్నారు.


ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న ఎమ్మెల్యే నసీర్


ప్రసంగిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, పక్కన ఎమ్మెల్యే మాధవి

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎన్నో సంక్షోభాలు ఎదురైనా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం నడుస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా తూర్పు నియోజకవర్గంలోని 11వ డివిజన్లో మంగళవారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి వందరోజుల పాలన ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. డివిజన్ సభలో ప్రజల సమస్యలపై అర్జీలను స్వీకరించి, వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాల కారణంగా అన్ని వ్యవస్థలు కుప్పకూలిపోయి సంక్షోభంలో పడిన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధి దిశగా పరుగులు తీయిస్తున్నారని అన్నారు. మెగా డీఎస్సీ, పెన్షన్ల పెంపు, అన్న క్యాంటీన్లు పునః ప్రారంభం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే చంద్రబాబు తొలి సంతకం చేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు, ఉస్మాన్, మజహార్, జమీర్, తదితర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

● ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేరుస్తున్నారని టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సజీలా పాల్గొన్నారు.

అన్ని వర్గాల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి : కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 24 : అన్నివర్గాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, 100 రోజుల ప్రజా పాలనను ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక స్తంభాల గరువు మెయిన్ రోడ్డులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి కమిషనర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ నియోజకవర్గంలో గత 100 రోజుల కాలంలో పీకల వాగులో సమగ్ర పూడికతీత, రోడ్ల మరమతులు, అన్న క్యాంటీన్లకు దాతల ద్వారా విరాళాలు, తాగునీటి సరఫరా మెరుగుకు కృషి చేశామన్నారు. డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, కార్పొరేటర్ వి.శ్రీరామ్ ప్రసాద్, కె.కోటేశ్వరరావు, ఏఈ సూరిబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ భాస్కర్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 24 : ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు తమ పరిధిలోని ప్రాంతాల్లో ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ మంగళవారం సగర కాలనీ, రామిరెడ్డి తోట, ఓల్డ్ క్లబ్ రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలను సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో కార్పొరేటర్ ఎం.శ్రీవల్లి, సిటి ప్లానర్ రాంబాబు, ఈఈ సుందరరామిరెడ్డి, ఏడిహెచ్ రామారావు, ఏసిపి అజయ్ కుమార్, ఎంహెచ్ఓలు రామారావు, ఆనంద కుమార్, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, డీఈఈ రాము, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రుణాల రీషెడ్యూల్, రీస్ట్రక్చరింగ్ చేయాలి : కలెక్టర్


బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బ్యాంకర్లు వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలు మేరకు ప్రభుత్వ ప్రాధాన్య పథకాలకు సక్రమంగా రుణాలను మంజూరు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ హాల్‌లో మంగళవారం జరిగిన బ్యాంకర్ల జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ (డీసీసీ), రివ్యూ కమిటీ సమావేశం జరిగింది. సమా వేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వరద ముంపును ఎస్ఎల్‌బీసీ ప్రకృతి వైపరీత్యంగా ప్రకటించినందున ఆర్‌బీఐ నిర్దేశించిన మార్గదర్శకాలు ప్రకారం వ్యవసాయ, వ్యక్తిగత, వాణిజ్య రుణాలను బ్యాంకర్లు రీ షెడ్యూల్, రీస్ట్రక్చరింగ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్, డీసీసీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్, డీజీఎం ఎస్.జవహర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి, ఆర్‌బీఐ మేనేజర్ ఏ.నాగ ప్రవీణ్, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, మత్స్య శాఖ ఏడీ గాలి దేముడు, సీసీఐ ఎస్ఎస్ రీజనల్ హెడ్ పరిమళ, బ్యాంకుల సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ పాల్గొన్నారు.

సెల్ఫీ బూత్ ప్రారంభం

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 24 : గ్రామీణ ఘన వర్థాల నిర్వహణలో భాగంగా స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం గుంటూరు కలెక్టరేట్ ప్రాంగణంలో సెల్ఫీ బూత్‌ను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ప్రారంభించారు. ఐటీసీ బంగారు భవిష్యత్, ఫినిష్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సెల్ఫీ బూత్ ప్రారంభించిన తర్వాత కలెక్టర్ చేతుల మీద గా గుంటూరు రూరల్ గ్రామ హరిత కార్మికులకు పీపీఈ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఓ కుసుమ శ్రీ దేవి , సర్పంచ్ ఎన్.లలిత కుమారి, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయ ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ సురేష్,ఫినిష్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ నహిదా, ఏపియం అరుణ పాల్గొన్నారు.

తిరుమల అపచారంపై స్వామీజీలు నోరు మెదపరే...

● బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు శ్రీధర్ శర్మ

గుంటూరు, సెప్టెంబరు 24 : స్వామీజీలు తిరుమల అపచారంపై నోరు మెదపరేమని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ ప్రశ్నించారు. గుంటూరులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో పెట్టుడు పీఠాలు పెట్టుకున్న చిన్న జీయర్ స్వామిజీ, విశాఖ శారద పీఠాధిపతులు స్వరూపానంద స్వామీజీ, సాత్వామనంద స్వామీజీలు ఈ విషయం మీద ఎందుకు నోరు మెదపట్లేదని శ్రీధర్ ప్రశ్నించారు. మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ ఈ అంశంపై ఢిల్లీలో మాట్లాడుతూ పంది కొవ్వు ప్రపంచంలోనే అత్యంత విలువైన వస్తువు అని, అది బంగారంతో సమానమని, ఆవు నెయ్యి రాగి, ఇత్తడి వంటి వస్తువు అని బంగారంలో రాగి కలిపితే తప్పేమి ఉందని చెప్పటాన్ని భగవంతుని పట్ల వైసీపీ నాయకులకు ఉన్న అహంకారానికి నిదర్శనం అని శ్రీధర్ దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో వడ్డమాను ప్రసాదు, వంగవీటి చైతన్య చిలుమూరు ఫణి, ఎండపల్లి శబరి పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకోండి : ఎస్పీ

గుంటూరు, సెప్టెంబరు 24 : ఇంటికి తాళం వేసి ఊరెళుతున్నారా... అయితే ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకోండి... నిశ్చింతగా వెళ్ళిరండి అని ఎస్పీ సతీష్‌కుమార్ భరోసా ఇస్తున్నారు. కార్పొరేషను, మున్సిపల్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఉచితంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ మొబైల్ యాప్ సేవలు అందుబాటులో ఉంటాయని ఎస్పీ తెలిపారు. ప్రజలు తమ అవసరాల నిమిత్తం బయట ప్రాంతాలకు వెళ్ళే సమయాల్లో తమ ఇళ్లలో ఎటువంటి దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక స్టేషన్‌లలో సమాచారం ఇస్తే రెండో కంటికి తెలియకుండా ఆ ఇంటిపై మూడో కన్ను ఉంటుందన్నారు.

జూడో మీట్‌లో సత్తాచాటిన జిల్లా విద్యార్థులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 24 : ఇటీవల తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూడో మీట్‌లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారని డీఈవో పి.శైలజ, స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి మెల్లంపూడి రవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 14 విభాగంలో జిల్లాకు చెందిన ఎం.వినోద్‌కుమార్ (డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, అడవితక్కెళ్ళపాడు) గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. కె.జాషువా (డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, అడవితక్కెళ్ళపాడు) 25 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. విద్యార్థులను డీఈవో పి.శైలజ, తదితరులు అభినందించారు.

చిన్నారి గుండె ఆపరేషన్‌కు ఆర్థికసాయం

గుంటూరు, సెప్టెంబరు 24 : పేద కుటుంబానికి చెందిన చిన్నారి గుండె ఆపరేషన్‌కు నెహ్రూనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్థిక సహాయం చేసింది. ఈ మేరకు నగర కమిషనర్ పులి శ్రీనివాస్, కొత్తపేట సీఐ వీరయ్య చేతుల మీదుగా చిన్నారి తల్లి రమణమ్మకు చెక్కు అందించారు. నెహ్రూనగర్ ఏరియాలో టెంపరరీ స్వీపర్‌గా పనిచేస్తున్న మున్సిపల్ వర్కర్ రమణమ్మ ఏడాదిన్నర మగ బిడ్డ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వారి ఆర్థిక పరిస్థితిని గమనించి అసోసియేషన్ అధ్యక్షులు ఘంటా శివ నాగేశ్వరావు వారికి రూ.75 వేల ఆర్థిక సహాయం అందజేసారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు, కొత్తపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు గంటా శివ నాగేశ్వరావు ప్రధాన కార్యదర్శి బండి రాం ప్రభువు, శంకర్ గట్టు శీను వినోద్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నూర్ బాషా కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపు అభినందనీయం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 24 : నూర్ బాషా కార్పొరేషన్‌కు రూ 100 కోట్లు కేటాయిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని రాష్ట్ర నూర్‌బాషా(దూదేకుల) ముస్లిం సంక్షేమ సంఘ అధ్యక్షుడు పీర్ మహమద్ అన్నారు. అమరావతి రోడ్డులో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూర్‌బాషాల అభివృద్ధికి చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు హర్షించదగ్గ విషయమన్నారు. నామినేటెడ్ పదవుల్లో దామాషా ప్రకారం నూర్‌బాషాలకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీమ్, ఉత్తరాంధ్ర జిల్లాల వర్కింగ్ అధ్యక్షుడు షేక్ సుభాన్, జిల్లా అధ్యక్షుడు కే ఖాజావలీ, ఆదమ్, షఫీ, షేక్ మస్తాన్, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

బోధనలో మెరుగైన పద్ధతులు అనుసరించాలి : ఆర్జేడీ

గుంటూరు(విద్య), సెప్టెంబరు 24 : స్థానిక కొత్తపేటలోని జలగం రామారావు మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను ప్రాంతీయ విద్య సంయుక్త సంచాలకులు బి.లింగేశ్వర్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అకడమిక్ అంశాలకు సంబంధించి ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలను అందించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని, ఉపాధ్యాయులు క్రమశిక్షణతో విధులకు హాజరుకావాలన్నారు.

క్రీస్తు చరిత్ర అత్యున్నతమైన కావ్యం

● మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 24 : మహాకవి గుర్రం జాషువా రచనల్లో క్రీస్తు చరిత్ర కావ్యం అత్యున్నతమైనదని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాదు అన్నారు. ఏసీ కళాశాలలోని జెడి శీలం సమావేశ మందిరంలో జాషువా కళా పీఠం ఆధ్వర్యంలో క్రీస్తు చరిత్ర కావ్యంపై మంగళవారం సభ జరిగింది. ఈ సభకు ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.మోజెస్ అధ్యక్షత వహించారు. ఏసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ టి.మాథ్యూ భాస్కర్ మాట్లాడుతూ జాషువా కవి క్రీస్తు చరిత్ర కావ్యంలో ఆసియా ఖండం ప్రాశ్యాస్త్యాన్ని వివరిస్తూ ఆసియా ఖండంలోనే అన్ని మతాలూ జన్మించాయన్నారు. కార్యక్రమంలో గుర్రం జాషువా స్మారక సమితి చైర్మన్ డాక్టర్ పెద్దీటి యోహాన్, విశ్రాంత అధ్యాపకుడు వై.శ్రీకాంత్, ఎంజేజేఎస్ కార్యదర్శి పరంగి సత్యరాజు, ప్రముఖ న్యాయవాది చందవోలు శోభారాణి, జర్నలిస్ట్ నలకుర్తి విల్సన్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొణతం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీటీ శాఖ గుంటూరు-1, 2 జేసీలు బాధ్యతల స్వీకారం

గుంటూరు, సెప్టెంబరు 24: వాణిజ్యపన్నులశాఖలో సాధారణ బదిలీల్లో భాగంగా నియమితులైన గుంటూరు-1 జాయింట్ కమిషనర్‌గా డీ.శ్రీలక్ష్మి, గుంటూరు-2 జాయింట్ కమిషనర్ గీతా మాధురీలు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిన్నాటవర్ సెంటర్‌లోని వసుంధర భవన్‌లో ఉన్న ఆ శాఖ కార్యాలయాల్లో జేసీలుగా బాధ్యతలు తీసుకున్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. గీతామాధురిని ది కమర్షియల్ టాక్స్ ఎన్జీవో అసోసియేషన్, గుంటూరు-2 డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ జానీ బాషా,డీవీ కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు వెంకటేష్, పగడాల శ్రీనివాస్, రవికుమార్,మాధవ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలియజేశారు.

లడ్డూ ప్రసాదంపై సీబీఐ విచారణ జరిపించాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 24: గత ప్రభుత్వంలో జరిగిన తిరుపతి లడ్డూ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని డొంకరోడ్డు యూత్, వెంగమాంబ సేవా సమితి నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక డొంకరోడ్డులో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. డొంకరోడ్డు శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద వంద కొబ్బరికాయలు కొట్టి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి సింగారావు, ఇరుగులపాటి వేణుగోపాల్, ఏలూరి సూర్యనారాయణ, రావెళ్ల రమణ, దారపునేని శ్రీలక్ష్మి, కె.రమాదేవి, తిరువీధి రమణయ్య, ఏలూరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

విద్యాసంస్థల్లో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 24 : స్థానిక బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ డే వేడుకల్లో నేచురోపతి సభ్యురాలు శ్రీదేవి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బీవి విజయభాస్కర్, చేగు శ్రీధర్, ప్రిన్సిపల్ కౌసల్యాదేవి, వైస్ ప్రిన్సిపల్ ఎ.రాధామాధవి, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ ఎన్‌ఎల్ దీప్తి, ఎం.గిరిజ పాల్గొన్నారు.

● స్థానిక టీజేపీఎస్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ మనోహర్, నిర్వహణ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

● గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ఏ.శ్రీధర్, సీనియర్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సనాతన ధర్మానికి విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

● జనసేన నేతలు గాదె, బోనబోయిన

గుంటూరు, సెప్టెంబరు 24: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుపతిలో కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డూప్రసాదంలో జరిగిన అపశృతికి ప్రాయశ్చిత్తంగా జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ 11 రోజులు పాటు ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ జనసేన నాయకులు, వీర మహిళలతో కలిసి గోరంట్లలోనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రాయశ్చిత్త దీక్ష స్వీకరించారు. ఈ సందర్భంగా గాదె వెంకటేశ్వరరావు మాటాడుతూ దేవదేవుడి ప్రసాద విషయంలో జంతువుల కొవ్వు కలపటం మాటల్లో చెప్పలేని అపశృతని, గత ప్రభుత్వం భక్తుల మనోభావాలతో పని లేకుండా తిరుమలను కేవలం ఆదాయ మార్గంగానే చూశారని అన్నారు. బోనబోయిన మాట్లాడుతూ కోట్లాదిమంది ప్రజల నమ్మకాన్ని గత ప్రభుత్వం పట్టించుకోకుండా దుర్మార్గంగా వ్యవహరించటం దారుణమన్నారు. గోరంట్ల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలతో కలిసి ప్రాయశ్చిత్త దీక్ష స్వీకరించారు. ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్ళా మాధవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్‌లు హాజరయ్యారు.


హోమం నిర్వహిస్తున్న జనసేన నేతలు గాదె, బోనబోయిన తదితరులు

తిరుమల పవిత్రతను కాపాడుతాం : ఎమ్మెల్యే మాధవి

● జనసేన చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షలకు సంఘీభావంగా బైక్ ర్యాలీ

గుంటూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల పవిత్రతను కాపాడుతామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. స్వామివారి లడ్డూ ప్రసాదం కల్తీ ఘటనను నిరసిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా గోరంట్లలోని వేంకటేశ్వర స్వామి గుడిలో జనసేన పార్టీ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షలకు సంఘీభావంగా ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో గుంటూరు పశ్చిమ కార్యాలయం నుంచి గోరంట్ల వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ద్విచక్ర వాహనంపై ఆమె ర్యాలీలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసిపీ చేసిన దుర్మార్గాలకు అంతే లేకుండాపోయిందన్నారు. పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షలకు సంఘీభావం తెలిపారు.


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

పారిశుధ్య కార్మికులను గౌరవించుకోవాలి

● బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజారోగ్యాన్ని కాపాడుతున్న పారిశుధ్య కార్మికులను ప్రతీ ఒక్కరూ గౌరవించాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ అన్నారు. సేవ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బృందావన్ గార్డెన్స్ పీఏఫ్ ఆఫీసు వద్ద ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత మెడికల్ హెల్త్ చెకప్ కార్యక్రమం జరిగింది. పారిశుధ్య కార్మికులకు ఆరుగురు స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వార 30 రకాల రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. పారిశుధ్య కార్మికులు, వైద్యులను బీజేవైఎం ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి, జిల్లా కార్యదర్శులు, సేవా పక్వాడ కోఆర్డినేటర్స్ ఏలూరి లక్ష్మి, జూపూడి దుర్గాభవాని, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి యాదవ్ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు చెరుకూరి తిరుపతిరావు, చరకా కుమార్ గౌడ్, వై వి సుబ్బారావు మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ రాష్ట్ర మీడియాకో కన్వీనర్ వెలగలేటి గంగాధర్, జితేంద్ర గుప్తా, బెహరా గాయత్రి, షేక్ బాజిత్ బీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అబూబకర్ తదితరులు పాల్గొన్నారు

నాయీబ్రాహ్మణ క్షవర వృత్తికి పేటెంట్ హక్కు కల్పించాలి

గుంటూరు, సెప్టెంబరు 24 : కార్పొరేట్ శక్తులు, ధనిక వర్గాలకు చెందిన వడ్డీ వ్యాపారస్తులు సెలూన్ రంగంలోకి ప్రవేశించి అనాదిగా క్షవర వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న నాయీబ్రాహ్మణ వృత్తిదారుల పొట్ట కొట్టటానికి ముందుకు రావడం అత్యంత దుర్మార్గమని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి క్షవర వృత్తిదారులకు పేటెంట్ హక్కు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు డిమాండ్ చేశారు. పాతగుంటూరు ప్రధాన రహదారిలో క్షవర వృత్తిదారులు మంగళవారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. యాదవ బజారు గాంధీ బొమ్మ సెంటర్‌లో ఈ మధ్యకాలంలో ఇతరులు ప్రారంభించిన సెలూన్ ముందు బైఠాయించి నాయీబ్రాహ్మణుల పొట్టలు కొట్టొద్దని నిరసనకు దిగారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సౌందర్య శాలల సంక్షేమ సంఘం గుంటూరు అర్బన్ కమిటీ కన్వీనర్ కే.బతేశ్వరరావు కో కన్వీనర్ నాగులవంచ రవీంద్ర, ఇంటూరు తులసీరామ్, నాయీబ్రాహ్మణ జేఏసీ జిల్లా నాయకులు నిడుముక్కల రాంబాబు, మార్టూరి రాఘవ, రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, భీమ్ సేన సేవాదళ్ళ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం ఈ ఆందోళన నిరసన కార్యక్రమంలో పాల్గొని పూర్తి మద్దతు తెలియజేశారు. సౌందర్య శాలల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు పెద్దప్రోలు శ్రీమన్నారాయణ, కొమ్మూరి నాగరాజు, గంగాధర భాస్కర్ ఎ.సుబ్రహ్మణ్యం గంధం నాగరాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

జీఎంసీ కమిషనర్‌తో సబ్ కలెక్టర్ భేటీ

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 24: గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులుని మంగళవారం జీఎంసి ప్రధాన కార్యాలయంలోని ఛాంబర్ లో గుంటూరు అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురు కొద్దిసేపు పలు అంశాలపై చర్చించారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 29వేల 200 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 24: ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 43వేల 791 క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 40 గేట్లను అడుగు మేర ఎత్తి దిగువకు 29వేల 200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 14వేల 591 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 6636 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 24: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 6636 క్యూసెక్కుల సాగునీటిని మంగళవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దిగువకు 29,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 290 క్యూసెక్కుల నీరు, రేపల్లెకాల్వకు 1760, తూర్పు కాల్వకు 570, పశ్చిమ కాల్వకు 180, నిజాంపట్నం కాల్వకు 400 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 3140 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో సామాజిక దృక్పథం

దుగ్గిరాల, సెప్టెంబరు 24: విద్యార్థి దశ నుంచే జాతీయ సేవా పథకం లో భాగమైన వారికి నైతిక విలువలు, సామాజిక దృక్పథం అలవడతా యని ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ బీ రాంబాబు తెలిపారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని దుగ్గిరాలలోని డాక్టర్ కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాఘవ రెడ్డి విద్యార్థులతో ప్రమాణం చేయించారు. పూర్ణచంద్రరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సరళాదేవి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నదిలో వ్యర్థాలను తొలగించిన కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లి, సెప్టెంబరు 24: పవిత్రమైన నదుల్లో చెత్తా చెదారం వేసి డంపింగ్ యార్డులవలె మార్చరాదని, నదుల పవిత్రతను కాపాడుకోవా లని ఇటీవల కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో కొట్టుకొచ్చిన వ్యర్థాలను కేఎల్‌యూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తొలగించారని విద్యార్థి విభాగాధిపతి కేఆర్ఎస్ ప్రసాద్ తెలిపారు. స్వచ్ఛతహి సేవ కార్యక్రమంలో భాగంగా ప్రాతూరు పరిధిలోని కృష్ణానది ఒడ్డుకు వచ్చిన ప్లాస్టిక్ సంచులు, వ్యర్థాలను చెత్తా చెదారాన్ని యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం తొలగించినట్టు ఆయన పేర్కొన్నారు.

పలు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం

పెదనందిపాడు, సెప్టెంబరు 24: మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు, టీడీపీ నాయకులు మంగళవారం ఇది మంచి ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించి స్టిక్కర్లు అంటించారు. ఇచ్చిన మాట ప్రకారం మహిళలు, వృద్ధులకు, సంక్షేమ పథకాలను సకాలంలో అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

శృంగారపురంలో అభివృద్ధికి రెక్కలు..

దుగ్గిరాల, సెప్టెంబరు 24: మండలంలోని శృంగారపురంలో అభివృద్ధికి రెక్కలు..ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం 100రోజుల పాలనలో సంక్షోభంలోనూ సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి ప్రజల మన్ననలను చూరగొంటున్న సందర్భంగా కూటమి నాయకులు గ్రామంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందించడంతోపాటు, ఇదిమంచి ప్రభుత్వం స్టిక్కర్లను అంటించారు.

ఎంటీఎంసీ పరిధిలో బోర్లకు మరమ్మతులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 24: మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పలు బోర్లకు మంగళవారం మరమ్మతులు నిర్వహించారు. తాడేపల్లి పట్టణం పదో వార్డు లోని వడ్డెర బజారు, 7వ వార్డులోని బొగ్గిళ్లు, మంగళగిరి బాప్టిస్టుపేటలోని కబేళా రోడ్డు ప్రాంతాల్లో పాడైపోయి నిరుపయోగంగా ఉన్న బోర్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. స్థానిక నాయకులు చేతిపంపుల దుస్థితిని మంత్రి దృష్టికి తీసుకురావడంతో స్పందించి మరమ్మతులను చేయించారు.

డ్వాక్రా మహిళలతో వరల్డ్ బ్యాంకు బృందం బేటీ

తుళ్లూరు, సెప్టెంబర్ 24: వరల్డ్ బ్యాంకు, ఏసీయా డెవలప్‌మెంట్(ఏడీబీ) బ్యాంకు ప్రతినిధులు డ్వాక్రా మహిళలతో తుళ్లూ రు సీఆర్డీఏ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. రుణాలు మంజూరు వాటి వల్ల వారు ఆర్థికంగా ఎదుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రాజధాని అమరావతి పనులు ప్రారంభమైనప్పుడు తీసుకున్న రుణంతో బడ్డీ కొట్టు, హోటల్స్, పిండి వంటలు, పచ్చళ్ల తయారీతో ఆర్థికంగా ఎదిగామని మహిళలు తెలిపారు. అనంతరం గవర్నమెంట్ మారటంతో రాజధాని నిర్మాణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. వ్యాపారాలు పెద్దగా లేకపోవటంతో ఆదాయం సన్నగిలిందని తెలిపారు. చంద్రబాబు సీఎం కావటంతో రాజధాని పనులు పారంభమైయ్యాయని, మరలా పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజధానిలో వ్యవసాయ పనులు లేని మీదట జీవనం కష్టంగా లేదా.. అని ప్రతినిధులు ప్రశ్నించారు. చాలా మందికి ఆ సమస్య ఉందని రాజధాని నిర్మాణ పనులు పా్రరంభమైతే ఏదో రకంగా ఉపాధి దొరుకుతుందని అన్నారు. అయితే రాజధాని అభివృద్ధి పనుల్లో ఇక్కడున్న కూలీలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తే సంతోషమన్నారు. మహిళలు తెలుగులో మాట్లాడిన ప్రతి విషయాన్ని, వరల్డ్ బ్యాంకు ప్రతినిధులు మాట్లాడిన ప్రతి అంశాన్ని సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ అనువదించారు. సమావేశంలో దొండపాడు, తుళ్లూరు, బోరుపాలెం తదితర గ్రామాల డ్వాక్రా మహిళలు, వరల్డ్, ఏడీబీ బ్యాంకు ప్రతినిధులు బయ్యార వెంకట్రావు, వి.సుబ్బారావు, రంజన్‌వర్మ, హర్షవర్ధన్ సింగ్, జాన్ మాథ్యు, సాహితీ ఘోష్, తులసీచరణ్, అచ్యుతరావు, సీఆర్డీఏ సోషల్ డీడీ బొర్రా శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పాల్గొన్నారు.

రైతులు మేలైన సాగు పద్ధతులు అవలంబించాలి

● వ్యవసాయ శాఖ డీడీ వెంకటేశ్వర్లు

మేడికొండూరు సెప్టెంబర్ 24: రైతులు వ్యవసాయంలో మేలైన సాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.వెంకటేశ్వర్లు చెప్పారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పేరేచర్లలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక పథకాల ను అమలు చేస్తుందన్నారు. సభ అనంతరం గ్రామ సమీపంలోని పంట పొలాలను పరిశీలించారు. ప్రత్తి పంటలో తెగుళ్లను వాటిని అరికట్టే పద్ధతులపై రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో గులాబిరంగు పురుగు

తాడికొండ, సెప్టెంబరు 24: పత్తిలో గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశం ఉన్నందు వల్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ సీ.హెచ్ నాగజ్యోతి పేర్కొన్నారు. మంగళవారం తాడికొండ మండలం పొన్నెకల్లు, దామరపల్లి గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ గులాబీ రంగు పురుగు ఆశించకుండా ఎకరానికి 10 లింగాకర్షక బుట్టలు ఉంచాలన్నారు. అధిక వర్షాల వల్ల వేరు కుళ్లు తెగులు వస్తుందని తెలిపారు. గులాబీ రంగు పురుగు నివారణకు, వేరు కుళ్ల తెగులు నివారణకు పురుగు మందులు పిచికారి చేయాలన్నారు. మంగళగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు జీ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పీ నరసింహారావు, పశుసంవర్ధక శాఖ అధికారి ఆర్.సౌజన్య పట్టు సంవర్ధకశాఖ అధికారి బీ.శశికళ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు నెల్లూరి కాంతారావు, రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అవసరం మేరకే ఎరువులను వినియోగించాలి : ఏడీఏ

దుగ్గిరాల, సెప్టెంబరు 24: వరిపంటకు అవసరమైన మేరకు మాత్రమే ఎరువులను వినియోగించాలని తెనాలి ఏడీఏ ఉషారాణి అన్నారు. మండలంలోని ఈమని, పేరుకలపూడి గ్రామాల్లో వరిక్షేత్రాలను పరిశీలించారు. పంటనాశించిన తెగుళ్ల నివారణ, దిగుబడిపై ప్రభావం పడకుండా ఎరువుల వినియోగం తదితర అంశాలను రైతులకు వివరించారు. ఎరువుల అధిక వినియోగంతో పంటకు నష్టం చేకూరే ప్రమాదం ఉందని రైతులు గుర్తించి, అధికారుల సూచనలు పాటిస్తూ మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు.

మంగళగిరిలో పొలం పిలుస్తోంది ప్రారంభం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 24: మంగళగిరి మండలం పెదవడ్లపూడి, చినవడ్లపూడి గ్రామాల్లో మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల అధికారులు పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం రైతు సేవా కేంద్రం వద్ద రైతులతో సమావేశం నిర్వహించారు.

ఎన్టీఆర్‌తో నా జర్నీ ఎప్పుడూ స్పెషలే!

జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటించిన 'దేవర' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు కొరటాల శివ ఆ సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను మీడియాకు తెలియజేశారు.



● మనిషికి మితిమీరిన ధైర్యం కూడా కరెక్ట్ కాదు. అది మూర్ఖత్వం అవుతుంది. మనకు తెలియకుండానే మనలో ఓ భయం ఉంటుంది. దాన్ని గౌరవించాలని చెప్పే కథ 'దేవర'. అయితే భయం లేకుండా ఉండాలనుకోవడం తప్పు. లా ఆఫ్ ల్యాండ్ అనేది ఉంటుంది కదా. దాన్ని అందరూ పాటించాలి. జవాబుదారీతనం కూడా ఒక భయమే. ఇలాంటి భయం ఉండడం వల్ల మనం చేసే పనిని చెక్ చేసుకుని మంచి రిజల్ట్ పొందుతాం.

● ఎన్టీఆర్‌తో జర్నీ ఎప్పుడూ నాకు స్పెషలే. ఏ విషయమైనా ఆయనతో డిస్కస్ చేసినప్పుడు బాగున్నా, బాగో లేకపోయినా డిప్లొమాటిక్‌గా సమాధానం చెప్పరు. ఓపెన్‌గా మనసులో ఉన్న భావాన్ని చెబుతారు. 'దేవర' లైన్ చెప్పినప్పుడు ఎన్టీఆర్ స్పందించిన తీరుతోనే నెక్ట్స్ లెవల్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నాం.

● 'దేవర' సినిమాను సెట్స్‌కు తీసుకెళ్లడానికి ఆరు నెలల సమయం తీసుకున్నాం. సముద్రం మీద ఎలా షూట్ చేయాలి, అక్కడ లైటింగ్ లో ఎలాంటి వేరియేషన్స్ ఉంటాయి. మనం సముద్రాన్ని ఎలా క్రియేట్ చేసుకోవాలి.. అనే అంశాలను బాగా స్టడీ చేశాం. దానికి ఎక్కువ సమయం పట్టింది. మన టెక్నీషియన్స్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అద్భుతమైన టాలెంట్ ఉన్నవాళ్లు ఎలాంటి ప్రిపరేషన్ లేకుండా స్పాట్‌కు వెళ్లినా వర్క్ చేసెయ్యగలరు. హాలీవుడ్ టెక్నీషియన్లు అలా కాదు. వాళ్లు ప్రిపేర్ కాకపోతే భయపడిపోతారు. ప్రతి సన్నివేశాన్నీ రిహార్సల్స్ చేసుకుని వెళతారు. మనవాళ్లకు కూడా హాలీవుడ్ టెక్నీషియన్స్ తరహాలో ప్రిపరేషన్ టైమ్ ఇస్తే ఇంకా అద్భుతాలు చేస్తారు.

● ఆచార్య సినిమా ఆశించిన స్థాయిలో ఆడలేదు. అయితే దానికి ఒత్తిడేం పడలేదు. 'దేవర' చిత్రానికి ఇంకా బాగా ప్రిపేర్ అయ్యా. 'ఆచార్య' రిలీజ్ అయిన 20 రోజుల్లోనే దేవర సినిమా మోషన్ పోస్టర్ పనిలో నిమగ్నమయ్యా.

● ఇంత పెద్ద కథను మూడు గంటల లోపు చెప్పగలమా అని 'దేవర' సెకండ్ షెడ్యూల్ టైమ్‌లోనే అందరం అనుకున్నాం. ఎందుకంటే నేరేషన్ నాలుగు గంటలుంది. పేపర్ మీద పెట్టినప్పుడు అది ఆరేడు గంటలు వచ్చింది. అయినా రెండు పార్టులు వద్దనుకుని రివర్స్‌లో వెళ్లాం. కానీ కుదరదని తేలిపోయింది. దాంతో రెండు భాగాలుగా తీయాలని నిర్ణయించుకున్నాం.

● కథ రాసుకునేటప్పుడే దేవర, అతని కొడుకు వర పాత్రలకు ఎన్టీఆర్‌నే అనుకున్నా. మరో హీరో కోసం రాసుకున్న కథ కాదు. మనిషిలో భయం ఉండాలని నేను చెప్పే ప్రయత్నం చేశా. ఆ భయాన్ని జాన్వీకపూర్‌లో చూశా. వారం పది రోజుల ముందే సీన్ పేపరు కావాలని అడిగి నా దగ్గర తీసుకుని ప్రాక్టీస్ చేసి సెట్స్‌కు వచ్చేది. ఫస్ట్ డే షూటింగ్‌లో ఆమె పాల్గొన్న సీన్ పూర్తి కాగానే తారక్ 'ఫెంటాస్టిక్' అంటూ అభినందించారు.

● 'ఓంకార' సినిమా చూశాక భైర పాత్రకు సైఫ్ అలీఖాన్ సరిపోతాడని ఫీల్ అయ్యా. కానీ ఆయనలో నార్త్ లుక్ ఉంటుందేమోనని సందేహించా. లుక్ టెస్ట్ చేద్దామని చెప్పి స్కెచ్ వేసి పంపించా. ఆయనే ముందు నమ్మలేదు. షూటింగ్‌కు ఒక గంట ముందే వచ్చి ప్రిపేర్ అయ్యేవారు. 'భైర' ఎలా ఉండాలని నేను అనుకున్నానో సైఫ్ అలాగే ఉన్నారు.

● అనిరుధ్ మ్యూజిక్‌కు నేను హ్యాపీ. నా కాన్సెప్ట్‌ను అర్థం చేసుకుని మంచి సంగీతం ఇచ్చాడు. త్వరలోనే ఆయుధ పూజ సాంగ్ రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నాం.

పి.సుశీలకు 'కలైంజర్ స్మారక కళారంగ' పురస్కారం



తమిళనాడు ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకల సందర్భంగా చిత్రసీమ ప్రముఖులకిచ్చే 'కలైంజర్ స్మారక కళారంగ విద్వాంసుల అవార్డు'కు గానకోకిల పి.సుశీల ఎంపికయ్యారు. గత మూడేళ్లుగా డీఎంకే ప్రభుత్వం ఈ అవార్డులను సినీ, కళారంగాలకు, దశాబ్దాల తరబడి సేవలందిస్తున్న దిగ్గజాలకు ప్రదానం చేసి సత్కరిస్తోంది. ఆ మేరకు 2023వ సంవత్సరానికి గాను ఈ అవార్డుకు తమిళ సినీ గేయరచయిత సాహిత్య అకాడమీ గ్రహీత ఎం.మేత్తా, సినీ నేపథ్య గాయని పి.సుశీల ఎంపిక అయ్యారు. ప్రముఖ తమిళ సినీ దర్శకుడు ఎస్పీ ముత్తురామన్ నేతృత్వంలో నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, మరో దర్శకుడు కరుపళనియప్పన్ సభ్యులుగా ఉన్న ఎంపిక కమిటీ ఈ మేరకు మంగళవారం ప్రకటించింది. ఈ అవార్డు గ్రహీతలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రూ.10లక్షల నగదు బహుమతి, ప్రశంసపత్రాన్ని అందజేయనున్నారు. ఈ నెల 30న చెన్నై సచివాలయంలో జరుగనున్న ప్రత్యేక కార్యక్రమంలో సినీ గేయరచయిత ఎం.మేత్తా, గాయని పి. సుశీల ఈ అవార్డులను అందుకోనున్నారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)



అమ్మ సెంటిమెంట్‌తో...

శ్రీనువైట్ల దర్శకత్వంలో గోపిచంద్, కావ్యథాపర్ జంటగా నటిస్తున్న చిత్రం 'విశ్వం'. టీ.జీ.విశ్వప్రసాద్, వేణు దొనేపూడి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్ 'మొండి తల్లి పిల్ల నువ్వు'ను మేకర్స్ లాంచ్ చేశారు. అమ్మ సెంటిమెంట్‌తో గుండెలకు హత్తుకునేలా సాగే ఈ గీతాన్ని శ్రీహర్ష ఈమని రాయగా.. చేతన్ భరద్వాజ్ సంగీతం అందించారు. సాహితీ చాగంటి ఆలపించారు. దసరా కానుకగా అక్టోబర్ 11న ఈ చిత్రం విడుదలవుతోంది. ఎడిటర్: అమర్‌రెడ్డి కుడుమల, డీఓపీ: కే.వీ.గుహన్.

కోరుకున్నంత వినోదం ఉంటుంది



'ఈ సినిమా కథ వినగానే వివేక్ గారు 'అచ్చ తెలుగు సినిమాలా ఉంది. టైటిల్ ఏమనుకుంటున్నారు' అని అడిగారు 'శ్వాగ్' అని చెప్పగానే ఆయన ఆశ్చర్యపోయారు. వంశవృక్షం గురించి అందరికీ తెలిసిందే కదా దాన్ని గురించి సినిమాలో చెప్పాం' అన్నారు హసిత్ గోలి. శ్రీవిష్ణు హీరోగా ఆయన రూపొందించిన 'శ్వాగ్' చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హసిత్ సినిమా గురించి వివరిస్తూ 'ఇందులో డిఫరెంట్ జనరేషన్స్ టచ్ చేశాం ఇది ఒక వంశానికి చెందిన కథ. ప్రతి జనరేషన్‌లో విష్ణు పాత్ర ఉంటుంది. తరతరాలుగా మగ, ఆడ గొడవ అనేది ఎలా మారుతూ వచ్చింది, ఇప్పటికి దాని రిలెవెన్స్ ఏమిటనే ఆలోచనలో చేసిన కథ ఇది' అన్నారు. 'ఈ సినిమాలో పాత్రల పేర్లు రిథమిక్‌గా పెట్టాలని అనుకున్నాం. అందుకే భవభూతి లాంటి పేర్లు పాత్రలకు పెట్టాం. సినిమాలో నాలుగు పాత్రలకు సమాన ప్రాతినిధ్యం ఉంటుంది. ఆ నాలుగు పాత్రలు కలసి ఎలాంటి కథ చెప్పబోతున్నారన్నది ఆసక్తికరం. చాలా మంచి కథ ఇది. విష్ణు నుంచి కోరుకునే ఫన్ ఉంటుంది. ఇంటర్వెల్ బ్లాక్ ఆశ్చర్యపోయేలా ఉంటుంది. అలాగే రీతూ వర్మ వింధ్యామర వంశీ రాణిగా కనిపిస్తారు. అద్భుతంగా నటించారు. వంశవృక్ష నిలయం అనే ప్లేస్‌ని క్రియేట్ చేసి పెద్ద సెట్ వేశాం. అందరం ఒక ఛాలెంజ్‌గా తీసుకుని వర్క్ చేశాం. శ్రీవిష్ణు చాలా ఎనర్జిటిక్‌గా పెర్ఫార్మ్ చేశారు. నాలుగు పాత్రల్లో స్పష్టమైన వ్యత్యాసం కనిపించాలని 'భారతీయుడు' తదితర చిత్రాలకు పని చేసిన రషీద్‌గారు ప్రోస్తెటిక్స్ చేశారు' అని వివరించారు హసిత్.

సరికొత్త ప్రపంచంలోకి...



సుధీర్‌బాబు నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'జటాధర'. ఈ పాన్ ఇండియా సినిమాను వెంకట్‌కల్యాణ్ దర్శకత్వంలో ప్రేరణ్ అరోరా, శివివన్ నారంగ్, నిఖిల్ నంద, ఉజ్వల్ ఆనంద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి సెకండ్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ "ఈ సినిమా మిమ్మల్ని ఓ సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. విజువల్‌గా.. ఎమోషనల్‌గా అద్భుతంగా ఉంటుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉన్న ఈ చిత్రం వచ్చే ఏడాది శివరాత్రికి విడుదలవుతుంది" అని చెప్పారు.

సిరిమల్లె చెట్టు లాంటి చిత్రం

- కార్తి



'దేవర' వార్‌ఫైర్ లాంటి సినిమా అయితే 'సత్యం సుందరం' సిరిమల్లె చెట్టు లాంటి అందమైన చిత్రం. ఈ రెండింటినీ తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి' అని హీరో కార్తి కోరారు. ఆయన కథానాయకుడిగా ప్రేమ్‌కుమార్ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా కార్తి మాట్లాడుతూ "అన్నయ్య సూర్యకూ ఈ కథ చాలా నచ్చింది. అరవింద్‌స్వామి కొత్తగా కనిపిస్తారు' అని హీరో కార్తి అన్నారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరి జీవితాలకు దగ్గరగా ఉండే చిత్రమిది. '96' చిత్రం లానే ఇది మీ మనసును చూరగొంటుంది' అన్నారు.

ఇది జగన్ పాపమే!

- పోలవరానికి ఆయన జమానాలోనే ప్రధాన నష్టం
- 2019, 20ల్లో వచ్చిన వరదలకే దెబ్బతిన్న డయాఫ్రం వాల్
- ప్రధాన డ్యాం ప్రాంతంలో భారీ గుంతలు
- తేల్చిచెప్పిన అంతర్జాతీయ నిపుణులు.. ప్రాజెక్టు అథారిటీకి నివేదిక

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



జగన్మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాతే 2019, 2020లో వచ్చిన వరదలకు డయాఫ్రం వాల్ సహా పోలవరం ప్రాజెక్టు కీలక నిర్మాణాలు దెబ్బతిన్నాయని అంతర్జాతీయ నిపుణుల కమిటీ (పీఈవో) స్పష్టం చేసింది. ఆయన హయాంలోనే ప్రాజెక్టుకు ప్రధాన నష్టం జరిగిందన్నారు. ఆయన బాధ్యతలు చేపట్టాక నిర్మాణాన్ని యథాతథంగా కొనసాగించి ఉంటే.. డయాఫ్రం వాల్‌పై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాంను నిర్మించి ఉంటే.. 2020 వరదలకు వాల్ దెబ్బతినేది కాదని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి పంపిన సమగ్ర నివేదికలో పేర్కొంది. ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్ దెబ్బతినడంతో.. మరమ్మతులు చేయాలా, కొత్తది నిర్మించాలా అనే సందేహాల నివృత్తికి అమెరికా, కెనడా దేశాలకు చెందిన ఇద్దరేసి నిపుణులను కేంద్ర జలశక్తి శాఖ నియమించింది. అమెరికాకు చెందిన ప్రాజెక్టుల నిర్మాణ నిపుణులు జియాన్ ఫ్రాంకో డి సిక్కో, డేవిడ్ బి పాల్.. కెనడా నిపుణులు సీన్ హించ్‌బెర్గర్, రిచర్డ్ డొనెల్లీ జూన్ 30, జూలై మొదటివారంలో ప్రాజెక్టు ప్రాంతంలో 4 రోజులు పర్యటించి స్వదేశాలకు వెళ్లిన వీరు.. తర్వాత ప్రాథమిక నివేదిక పంపారు. అందులోని కొన్ని అంశాలపై కేంద్ర జల సంఘం, రాష్ట్ర జల వనరుల శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ప్రధానంగా 2016లో ప్రారంభించిన వాల్ 2018లోనే పూర్తయితే.. 2018లోనే దెబ్బతిన్నట్లుగా ప్రాథమిక నివేదికలో పేర్కొనడాన్ని ఆక్షేపించాయి. సమగ్ర అధ్యయనం చేశాక.. స్పష్టమైన నివేదిక ఇవ్వాలని అంతర్జాతీయ నిపుణులను కోరుతూ లేఖ రాశాయి. దీనిపై స్పందించి అధ్యయనం చేసిన వారు.. సోమవారం పీపీఏకి సమగ్ర నివేదిక పంపారు. 2019, 2020ల్లో వచ్చిన భారీ వరద ప్రవాహాన్ని స్పిల్‌వేతో పాటు ప్రధాన డ్యాం ప్రాంతం మీదుగా వదిలేయడం వల్లే డయాఫ్రం వాల్ దెబ్బతిందని అందులో స్పష్టం చేశారు. 2020లో వచ్చిన భారీ వరద ప్రవాహ సుడుల కారణంగా 485 మీటర్ల మేర వాల్‌కు నష్టం జరిగిందని.. గ్యాప్-2 ప్రాంతంలో భారీ గుంతలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఇలా దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌కు మరమ్మతు చేయడం కంటే.. కొత్తది నిర్మించడమే ఉత్తమమని తెలిపారు. ఈ దిశగా ఎప్పుడో నిర్ణయం తీసుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. మేఘా ఇంజనీరింగ్ సంస్థకు నిర్మాణ బాధ్యతను అప్పగించాయి కూడా.

మరిన్ని సూచనలివీ..

2023 జూలై 21న ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల మధ్య బూడిద రంగులో ఉన్న బురదతో కూడిన సీపేజీని గుర్తించారు. ఈ బురద 7.91 మీటర్ల ఎత్తులో నిల్వ ఉంది. గత ఏడాది ఆగస్టు రెండో తేదీన 7.91 మీటర్లు, ఈ ఏడాది జూలై 21న 15.57 మీటర్లు, జూలై 22న 13.76 మీటర్లు, జూలై 29వ తేదీన 11.31 మీటర్ల మేర సీపేజీ వరద రెండు కాఫర్ డ్యాంల మధ్య నిల్వ ఉంది. ఈ సీపేజీని తగ్గించేందుకు పంపింగ్ ద్వారా డీవాటరింగ్ చేయాలని నిపుణులు పేర్కొన్నారు. 'కొత్త వాల్ నిర్మాణం సందర్భంగా ఫ్లాక్సిస్, సిగ్మా, అన్సిస్ పరీక్షలు నిర్వహించాలి. దాని నిర్మాణం ప్రస్తుతం ఉన్న డయాఫ్రం వాల్‌కు దిగువ భాగాన నిర్మించాలి. ఇప్పుడున్న వాల్ నిర్మాణ విధానాన్నే కొత్త వాల్‌కూ అనుసరించాలి. పొడి వాతావరణంలో, నేల చిత్తడిగా లేనప్పుడు దాని నిర్మాణం చేపట్టాలి' అని సూచించారు. ఈ ఏడాది నవంబరులో మొదలుపెట్టి.. 2025 జూలైలోగా డయాఫ్రం వాల్‌ను నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంచేసిన కార్యాచరణ ప్రణాళికను నిపుణులు ఆమోదించారు. ఒకే సీజన్‌లో వాల్ నిర్మాణం పూర్తి చేయడం మంచిదన్నారు. ప్రధాన డ్యాం నిర్మాణ సమయంలో.. జలసంఘం, పీపీఏ, కాంట్రాక్టు సంస్థ నిరంతరం చర్చించుకుంటూ సమన్వయంతో పనులు పూర్తి చేయాలని, డిజైన్లపై వర్క్‌షాపు నిర్వహించుకోవాలని పేర్కొన్నారు.



అబద్దయ్య | అజయ్ బాబు | పీతల సుజాత | తాతయ్య బాబు | శ్రీనివాసులు | దామచర్ల సత్య | దీపక్ రెడ్డి | సుబ్బారెడ్డి | లంకా దినకర్ | బంగార్రాజు | మాణిక్యాలరావు

బడుగులకు పెద్దపీట!



సత్యనారాయణ | బాలాజీ | శివశంకర్ | సీతారామ సుధీర్ | బాబురావు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని అదే టెలికాన్ఫరెన్స్‌లో చెప్పిన చంద్రబాబు.. అదే మాట ప్రకారం బాగా పనిచేసినవారు తొలి జాబితాలో ప్రముఖంగా కనిపించేలా చూశారు. కేవలం పై స్థాయి నాయకులే కాకుండా కింది స్థాయిలో పనిచేసిన వారికీ చోటు కల్పించారు. ఎన్నికల ముందు టీడీపీ అంతర్గతంగా ఐదు వేల మంది ఓటర్లకు ఒక యూనిట్ ఇన్‌చార్జిని.. 25 వేల మందిని ఓటర్లకు ఒక క్లస్టర్ ఇన్‌చార్జిని నియమించి వారితో ఎన్నికల యుద్ధాన్ని నడిపించింది. ఇందులో ఒక క్లస్టర్ ఇన్‌చార్జికి ఇప్పుడు ఏకంగా చైర్మన్ పదవి లభించింది. శ్రీకాకుళం జిల్లాలో కాళింగ సామాజిక వర్గానికి చెందిన వజ్జా బాబూరావు ఇటీవలి ఎన్నికల్లో ఒక ప్రాంతంలో క్లస్టర్ ఇన్‌చార్జిగా పనిచేశారు. ఆయన్ను రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్‌గా నియమించారు. చైర్మన్, డైరెక్టర్లు కలిపి మొదటి జాబితాలో 99 మందికి చోటు కల్పించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా టీడీపీ తన అభ్యర్థులకు సంబంధించి 99 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేయడం విశేషం. వీరిలో 11 మంది క్లస్టర్ ఇన్‌చార్జులు ఉన్నారు. ఆరుగురు యూనిట్ ఇన్‌చార్జులకు డైరెక్టర్ పదవులు దక్కాయి. 20 చైర్మన్ పదవుల్లో 16 టీడీపీ, మూడు జనసేన, ఒకటి బీజేపీకి లభించాయి. డైరెక్టర్ల పదవులను కూడా కూటమి పార్టీల మధ్య పంచారు.

త్యాగరాజులు వీరే..

తమ నియోజకవర్గాల్లో కొంతకాలం పనిచేసి తర్వాత రకరకాల కారణాలతో సీటు త్యాగం చేసిన 8 మంది టీడీపీ నేతలకు ఈ జాబితాలో చైర్మన్ పదవులు లభించాయి. వీరిలో మచిలీపట్నానికి చెందిన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పోలవరం మాజీ ఎమ్మెల్యే బొరగం శ్రీనివాసులు, నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, డోన్ నియోజకవర్గానికి చెందిన మన్నె సుబ్బారెడ్డి, ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే పీతల సుజాత ఉన్నారు. వీరిలో నలుగురు మిత్రపక్షాల కోసం సీట్లు త్యాగం చేయగా.. మరో నలుగురు సొంత పార్టీ నేతల కోసం త్యాగం చేశారు. ఉదాహరణకు నాటి ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు మాజీ ఎంపీ రఘురామకృష్ణంరాజుకు అవకాశం కల్పించడం కోసం తాను పోటీ నుంచి వైదొలిగారు. అలాగే నెల్లూరులో నారాయణ అబ్దుల్ అజీజ్ తప్పుకొన్నారు. వారిద్దరికీ ఇప్పుడు పదవులు లభించాయి. మిత్రపక్షాలకు సీట్లు పోవడం వల్ల బొరగం శ్రీనివాసులు, బంగార్రాజు, పీలా గోవింద్ పోటీ చేయలేకపోయారు. వారికి కూడా నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం ఇచ్చారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎస్సీలకు రిజర్వు అయిన 3 అసెంబ్లీ సీట్లను టీడీపీ అధిష్ఠానం మాదిగ వర్గానికి కేటాయించింది. సామాజిక సమతుల్యత కోసం మాల సామాజిక వర్గానికి చెందిన పీతల సుజాతకు తాజాగా రాష్ట్ర వినియోగదారుల పరిరక్షణ మండలి చైర్‌పర్సన్ పదవి ఇచ్చారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన పార్టీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావుకు కూడా లిడ్‌క్యాప్ చైర్మన్ పదవి లభించింది. మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వారు అధికంగా ఉండడంతో ఆ వర్గానికి చెందిన నందం అబద్ధయ్యకు రాష్ట్ర పద్మశాలి సంక్షేమ-అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశమిచ్చారు. లోకేశ్ పాదయాత్రలో వాలంటీర్ల విభాగం కన్వీనర్‌గా పనిచేసిన తెలుగు యువత నేత రవి నాయుడికి శాప్ చైర్మన్ పదవి దక్కింది. అనేక మంది ఆశలు పెట్టుకున్న పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి ఒంగోలు జిల్లా పార్టీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ యాదవ్‌కు ఇచ్చారు. ఆయనతోపాటు ఎన్నికల సమయంలో జిల్లా పార్టీ అధ్యక్షులుగా పనిచేసిన నలుగురికి పదవులు దక్కాయి. వీరిలో కొనకళ్ల నారాయణ (కృష్ణా), అబ్దుల్ అజీజ్ (నెల్లూరు), బత్తుల తాతయ్య (అనకాపల్లి) ఉన్నారు. కుప్పంలో పార్టీ సీనియర్ నేత, బీసీ వర్గాలకు చెందిన పీఎస్ మునిరత్నానికి ఆర్టీసీ వైస్ చైర్మన్ పదవి లభించింది. దామచర్ల సత్యకు కూడా కీలకమైన ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ పదవి లభించింది. మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి మేనల్లుడు, పార్టీ అధికార ప్రతినిధి దీపక్ రెడ్డికి కొత్త ఉద్యోగాల కల్పనకు సంబంధించిన సీడాప్ చైర్మన్ పదవిని ఇచ్చారు.

డైరెక్టర్లలో మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు

కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా వేసిన వారిలో మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు కూడా ఉండడం విశేషం. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి పరసా రత్నాన్ని మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమించారు. రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, సాలూరు మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భాంజుదేవ్‌ను పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్లుగా నియమితులయ్యారు.

డైరెక్టర్ పదవి వద్దన్న శిష్టా లోహిత్

పౌర సరఫరాల సంస్థలో డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శిష్టా లోహిత్ తనకు ఆ పదవి వద్దని పార్టీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబుకు మంగళవారం సాయంత్రం లేఖ రాశారు. 'నాకు ఈ పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు. మీరు అభిమానంతో ఇచ్చిన ఈ పదవిని తీసుకోవడానికి సిద్ధంగా లేను. నాకు కేటాయించిన ఈ పదవిని పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న మరెవరికైనా కేటాయించాలని నా మనవి. పదవి ఉన్నా, లేకున్నా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాను' అని అందులో పేర్కొన్నారు.

కొనకళ్లకు ఆర్టీసీ...

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురు చూస్తున్న ఆశావహులకు ప్రభుత్వం మంగళవారం శుభవార్త అందించింది. 20 కీలక నామినేటెడ్ చైర్మన్లు, పలు కార్పొరేషన్లకు సంబంధించి 79 మంది సభ్యులను ప్రకటించారు. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వారి అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు సభ్యుల పేర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

20 సూత్రాల సంఘం, చైర్మన్: లంకా దినకర్ (బీజేపీ - ఒంగోలు)

పౌరసరఫరాల సంస్థ, చైర్మన్: తోట మెహర్ సీతారాం సుధీర్ (జనసేన - కాకినాడ సిటీ)

డైరెక్టర్లు: వంతల రాజేశ్వరి, మోకా ఆనంద్ సాగర్, రాయపాటి శైలజ, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ప్రవీణ్‌తాజ్, శిష్టా లోహిత్, బోయ మహేష్ నాయుడు, గద్దె బాబూరావు, ఆర్‌పీ భాంజ్‌దేవ్, తోట పార్థసారథి, కోటేశ్వర కేశన్, కె.లక్ష్మీనారాయణ, తుమ్మల పద్మజ లక్ష్మి (బీజేపీ), కడలి ఈశ్వరి (జనసేన), బోడపాటి శివదత్(జనసేన)

ఏపీ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్, చైర్మన్: నందం అబద్దయ్య, మంగళగిరి

సభ్యులు: దాసరి శ్రీనివాస్, హరికిశోర్, గంజి మాధవయ్య, పి.పురుషోత్తం, కందుల నాగార్జున, మత్సెట్టి శివ సత్యప్రసాద్, సింగం వెంకటేశ్వరరావు, తాళ్ల నరసింహస్వామి, జొన్నాదుల మహేశ్వరరావు, శ్రీరామదాసు గంగాధర, పి. లక్ష్మి నరసింహులు, తేడా సత్యనారాయణ, బిట్రా వెంకటసత్యనారాయణ(బీజేపీ), పర్వతం మధుసూదన్‌రావు(జనసేన), సూరిశెట్టి జయనాగకృష్ణ(జనసేన)

ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చైర్మన్: పీలా గోవింద సత్యనారాయణ, అనకాపల్లి

సభ్యులు: పంతంగి నరసింహప్రసాద్, డాక్టర్ చందన స్రవంతి, గోనుగుంట్ల విజయ్‌కుమార్, దాసరి రాజా మాస్టర్, బచ్చల పుల్లయ్య, వూకా విజయ్‌కుమార్, రామాంజనేయులు(పాణ్యం), బూక్యా కాలే నాయక్, షేర్ రమణయ్య, వెంగమాంబ శ్రీనివాస్(బీజేపీ), యర్రా వేణుగోపాలరాయుడు, అంగ దుర్గ ప్రశాంతి(జనసేన), వడ్రాణం మార్కండేయ బాబు(జనసేన)

ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చైర్మన్: నూకసాని బాలాజీ, కొండెపి

సభ్యులు: పీవీజీ కుమార్, కిల్లు రమేష్‌నాయుడు, కుర్రా అప్పారావు, కటారి హేమలత, క్రైపా పద్మలతారెడ్డి, ఇందుకూరి సుబ్బలక్ష్మి, వాసిరెడ్డి రాంబాబు, కొడాలి వినోద్‌కుమార్, గంటా స్వరూపాదేవి(జనసేన), డాక్టర్ పాకంటి గౌతమ్‌రాజ్(జనసేన)

మార్క్‌ఫెడ్ చైర్మన్: కర్రోతు బంగార్రాజు, నెలిమర్ల

సభ్యులు: అన్నెపు రామకృష్ణనాయుడు, పరసా వెంకటరత్నం, కేసీ హరి, తాతిరెడ్డి తులసిరెడ్డి, వంగల శశిభూషణ్‌రెడ్డి(బీజేపీ), గుండుబోగుల నరసింహరావు(జనసేన)

ట్రైకార్, చైర్మన్: బొరగం శ్రీనివాసులు, పోలవరం

సభ్యులు: పూవల లావణ్య తిరువీధి అనూరాధ, కుడా కృష్ణారావు(బీజేపీ)

ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చైర్మన్: మన్నె సుబ్బారెడ్డి, డోన్

సభ్యులు: కమతం కాటమయ్య, చిల్లా జగదేశ్వరి

స్టేట్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్, చైర్‌పర్సన్: పీతల సుజాత, భీమవరం **సభ్యులు:** నగిడి నాగేశ్వరరావు

ఆర్టీసీ, చైర్మన్: కొనకళ్ల నారాయణ, మచిలీపట్నం

వైస్ చైర్మన్: పీఎస్ మునిరత్నం

ఏపీఐఐసీ చైర్మన్: మంతెన రామరాజు, ఉండి

మారిటైం బోర్డు, చైర్మన్: దామచర్ల సత్య కొండెపి

ఏపీ హౌసింగ్ బోర్డు, చైర్మన్: బత్తుల తాతయ్య బాబు, చోడవరం

ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీటీపీసీ), చైర్మన్: వజ్జా బాబూరావు, పలాస

లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చైర్మన్: పిల్లి మాణిక్యాలరావు, చీరాల

సీడాప్, చైర్మన్: దీపక్‌రెడ్డి, రాయదుర్గ

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్), చైర్మన్: అనిమిని రవినాయుడు, తిరుపతి

ఏపీ టిడ్కో, చైర్మన్: వేములపాటి అజయ్‌కుమార్(జనసేన), నెల్లూరు సిటీ

ఏపీఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చైర్మన్: తమ్మిరెడ్డి శివశంకర్(జనసేన), శ్రీకాకుళం

వక్ఫ్‌బోర్డు, చైర్మన్: అబ్దుల్ అజీజ్, నెల్లూరు రూరల్

నాలుగేళ్ల బాలుడికి కాలేయ మార్పిడి శస్త్రచికిత్స

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 24: హెపాటో బ్లాస్టోమా (కాలేయ గాయం)తో బాధపడుతున్న నాలుగేళ్ల బాలుడికి విజయవంతంగా లివింగ్ డోనార్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ (ఎల్‌డీఎల్‌టీ) నిర్వహించినట్టు మణిపాల్ వైద్యశాల సౌత్ ఏషియన్ లివర్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు ప్రకటించారు. మంగళవారం తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో మణిపాల్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ డాక్టర్ ప్రదీప్ థామస్ చెరియన్ నేతృత్వంలోని వైద్యబృందం ఈ శస్త్ర చికిత్సను నిర్వహించారని చెప్పారు. విజయనగరం జిల్లా నెమలం గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్ అనే బాలుడు పొత్తికడుపు నొప్పి వాపు లక్షణాలతో బాధపడుతున్న బాలుడిని జూలై 31న మణిపాల్ వైద్యశాలకు తీసుకువచ్చారని, సమగ్ర పరీక్షల్లో ఆ బాలుడి కాలేయంలో కుడి లోబ్‌లో తక్కువస్థాయి జీవక్రియ పరంగా గాయం ఉన్నట్టు గుర్తించామన్నారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో లివింగ్ డోనార్ లివర్ ప్లాంటేషన్ శస్త్ర చికిత్స ఆగస్టు 1న నిర్వహించినట్టు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం అందించిన నిధులు, మణిపాల్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో బాలుడికి ఈ కాలే య మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించారన్నారు. బాలుడు పూర్తిగా కోలుకొని ఆరోగ్యంగా ఉన్నాడని డాక్టర్ సుధాకర్ తెలిపారు.

ఎంపీడీవోగా లక్ష్మీదేవి బాధ్యతల స్వీకారం

పెదనందిపాడు, సెప్టెంబరు 24: పెదనందిపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా లక్ష్మీదేవి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆమె ప్రకాశం జిల్లా బదిలీపై విచ్చేశారు. ఈవోపీఆర్డీగా ఉన్న సాయిలీల ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మీదేవి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య మెరుగుదలకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తారన్నారు. ఆమెను కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

కాకుమాను ఎంపీడీవోగా యుగకీర్తి

కాకుమాను, సెప్టెంబరు 24: కాకుమాను ఎంపీడీవోగా యుగకీర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన రామకృష్ణ పెదకూరపాడు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవోగా భాధ్యతలు చేపట్టిన యుగకీర్తి మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం నూతన ఎంపీడీవో యుగకీర్తిని కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు.

స్టేడియం అభివృద్ధిపై మంత్రి లోకేశ్‌కు వినతి

మంగళగిరి, సెప్టెంబరు 24: నవులూరు గ్రామంలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం అభివృద్ధికి సంబంధించి విజయవాడ ఎంపీ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని) మంత్రి నారా లోకేశ్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఇక్కడ జాతీయ, అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏసీఏ స్టేడియానికి దారితీసే రోడ్డు మార్గాలు, పార్కింగ్ స్థలం, డ్రైయినేజీలను అభివృద్ధి చేయాలని విన్నవించారు.

బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

మంగళగిరి, సెప్టెంబరు 24: వరదల కారణంగా మంగళగిరి పట్టణంలో కొండచరియలు విరిగిపడి నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు మంత్రి నారా లోకేశ్ సహకారంతో మంగళవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. గండాలయపేట, కొత్తపేట, ద్వారకానగర్ కొండ ప్రాంతాల్లో ఉపాధి కోల్పోయిన 47 కుటుంబాలకు 15 రోజులుగా పునరావాసం కల్పించి మంగళవా రం 5వ సచివాలయం వద్ద నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్ర మంలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, బీసీ సెల్ అధ్య క్షుడు వాకా మాధవరావు, పద్మశాలి సాధికార సమితి సభ్యుడు జొన్నా దుల బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలి

ఫిరంగిపురం, సెప్టెంబరు 24: జాతీయ భావాన్ని ప్రతి ఒక్కరు పెంపొందించుకొని సామాజిక సేవా భావాన్ని కలిగి ఉండాలని డాక్టర్ జేవీ సుధీర్ కుమార్ అన్నారు. మంగళవారం ఫిరంగిపురంలోని దీనాపూర్ క్యాంపస్‌లో సెయింట్ జేవీఆర్ ఫార్మసీ కళాశాల, ఆర్‌సీజేసీ కళాశాలల ఆధ్వర్యంలో 55వ జాతీయ సేవా పథకాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ జే జీవన్ మాణిబాబు మాట్లాడుతూ రక్తదానం ప్రాధాన్యతను వివరించారు. అలాగే ఆర్‌సీజేసీ ప్రిన్సిపాల్ సుదర్శన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడవచ్చునని అన్నారు. కళాశాల ప్రాంగణంలో డాక్టర్ జేవీ సుధీర్ కుమార్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆర్ రాణి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్ మెర్సిరాణి తదితర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమే

- ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 24: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రత్తిపాడులోని బీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి క్రీడా ఎంపికలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి పెట్టాలన్నారు. క్రీడల్లో విద్యార్థులు రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు భోజనం షెడ్‌తో పాటు, సైకిల్ షెడ్‌లు కావాలంటూ ఎమ్మెల్యేను కోరగా పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత, మిగతా తరగతుల్లో నూరుశాతం హాజరుశాతం సాధిస్తే మీరు కోరినవి వెంటనే చేపిస్తానన్నారు. అనంతరం క్రీడలను ప్రారంభించి వారితో కొద్ది సేపు వాలీబాల్ ఆడారు. కార్యక్రమంలో డీవైఈవో వెంకటేశ్వరరావు, ఎంఈవో రమాదేవి, లీలారాణి, హెచ్ఎం శ్రీనివాసరావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకురాలు వందనాదేవి, దేశం నేతలు గింజుపల్లి వెంకటేశ్వరరావు, శివరామ ప్రసాద్, చెన్నుబోయిన శ్రీనివాసరావు, నియోజకవర్గ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ రాజ్‌కుమార్, కుర్రి సుబ్బారెడ్డి, పెంటారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది ప్రజాసేవకులుగా పని చేయాలి

- ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ హితవు




పేరేచర్లలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

మేడికొండూరు సెప్టెంబరు 24. మనమంతా ప్రజలకు సేవకులుగా మారి పనిచేయాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ సచివాలయ సిబ్బందికి సూచించారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం పేరేచర్లలో జరిగిన గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు ఎంపీడీవో చందన అధ్యక్షత వహించారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ సిబ్బందిలో సమర్థత ఉన్నప్పటికీ వారిపై సరైన అజమాయిషీ లేదన్నారు. ఇప్పటి వరకు ఒక ప్రణాళిక లేకుండా పని చేశారని ఇకపై ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు అందించాలని, ప్రజా సమస్యల పరిష్కరించాలని సూచించారు. సచివాలయ సిబ్బందిలో ఎవరైనా విధులకు సక్రమంగా హాజరు కాకపోయినా, పని చేయకపోయినా తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీలకు అమలు చేసిన అన్ని పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని, వాటిని తిరిగి అమలు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 అన్న క్యాంటీన్లు ప్రారంభమయ్యాయని, పేరేచర్ల, ఫిరంగిపురం, తాడికొండ గ్రామాల్లో అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాల్సిందిగా తాను సీఎం చంద్రబాబును కోరానని, త్వరలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. సభలో మండల ప్రత్యేక అధికారి వీరాచారి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో పేరేచర్ల సర్పంచ్ దేవరకొండ రాజ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ సభ్యులు పాములపాటి శివన్నారాయణ, మాజీ ఎంపీపీ మొక్కల సుబ్బారావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నార్నె శ్రీనివాస్, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో మంగళగిరి నేతలకు ప్రాధాన్యం



అబద్దయ్యకు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ



అబద్దయ్య, పార్థసారథిలకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేతలు

మంగళగిరి, సెప్టెంబరు 24: ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో మంగళగిరి నియోజకవర్గానికి చెందిన కూటమి నేతలకు ప్రాధాన్యం లభించింది. టీడీపీ మంగళగిరి మండల అధ్యక్షుడు తోట పార్థసారధి ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులయ్యారు. అలాగే, ఏపీ పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్లుగా జనసేన పార్టీకి చెందిన చేనేత వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతం మధుసూదనరావు, టీడీపీ నేత కందుల నాగార్జున నియమితులయ్యారు. పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నందం అబద్దయ్యకు ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మంగళగిరి మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్ మన్నెం రమేష్‌బాబు, అనిత దంపతులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు జవ్వాది కిరణ్‌చంద్, మాదల రమేష్‌బాబు, గాదె పిచ్చిరెడ్డి, సంకా బాలాజీ గుప్తా, గుత్తికొండ ధనుంజయరావు, ఆకురాతి నాగేంద్రం, ఉమామహేశ్వరరావు, రాఘవ, పద్మశాలీ సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

మంగళగిరి ఏపీపీగా శివలీల

మంగళగిరి, సెప్టెంబరు 24: మంగళగిరి అడిషనల్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కే.శివలీల నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు గుంటూరు ఎక్సైజ్ కోర్టులో ఆమె ఏపీపీగా పనిచేశారు. మంగళగిరి కోర్టులో ఇప్పటివరకు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసిన ఎన్ నాగమణి గురజాలలోని మొదటి అదనపు సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ అయ్యారు.

275 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, సెప్టెంబరు 24: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 275 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,500, గరిష్ఠ ధర రూ.12,500, మోడల్‌ధర రూ.11,800 పలికాయి. కాయ కనిష్ఠధర రూ.12,050, గరిష్ఠధర రూ.12,500, మోడల్‌ధర రూ.12,450 పలికాయి.

ఏపీఐఐసీ భవనంలో చేనేత వస్త్ర ప్రదర్శన

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 24: మంగళగిరి ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ భవనం 11వ అంతస్తులో చేనేత సంఘాలు, నేత కార్మికులు, మాస్టర్ వీవర్ల ఆధ్వర్యంలో చేనేత వస్త్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కే.సునీత, కమిషనర్ రేఖారాణి మంగళవారం సందర్శించారు. జిల్లా వ్యాప్తంగా చేనేత కార్మికులు నేసిన వివిధ రకాల వస్త్రాలను ప్రదర్శనలో ఉంచారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యకార్యదర్శి సునీత మాట్లాడుతూ చేనేత వస్త్రాల అమ్మకాలు, మార్కెటింగ్ పెంచి కార్మికుల ఆదాయం పెరిగేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మంగళగిరి చేనేతకు పూర్వవైభవం తీసుకువచ్చేం దుకు మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ ఏడీ వనజ, ఎన్నారై టీడీపీ అధ్యక్షుడు వేమూరి రవి, తమ్మిశెట్టి జానకీదేవి, దామర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో 'ఇది మంచి ప్రభుత్వం'

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 24: తాడేపల్లి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజుల్లో సాధించిన ప్రగతిని వివరిస్తూ చంద్రబాబు అనుభవం, మేధస్సుతో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. వంద రోజుల్లోనే అభివృద్ధిని గాడిన పెడుతూ మరో పక్క పథకాలను అమలు చేస్తూ ప్రతి నెల 1వ తేదీకి పింఛన్లు ఉద్యోగుల జీతాలు, ఇచ్చేలా చేయడం సీఎం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. నేతన్నలకు హామీ ఇచ్చినట్టు రూ.25 కోట్లతో ఆరోగ్య బీమా అమలు చేసి 1.23లక్షల చేనేత కుటుంబాలకు లబ్ధి చేకూర్చినట్టు తెలిపారు. విజయవాడ వరదల్లో 10 రోజుల పాటు సీఎం చంద్రబాబు మంత్రి లోకేశ్ ప్రజలకు అండగా నిలబడి సేవలు చేశారన్నారు. కార్యక్రమంలో ముమ్మడి సత్యనారాయణ వల్లభనేని వెంకటరావు, మండవ గోపాలరావు, కేళి వెంకటేశ్వరరావు, ఇట్టా భాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో ఘనంగా టీచర్స్ డే

- డాక్టర్ సుదర్శన్‌కు బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డు
- మరో 9 మంది అధ్యాపకులకు పురస్కారాలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 24: భారీ వర్షాలు, వరదల కారణంగా ఈ నెల 5న జరగాల్సిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించింది. బోధన, పరిశోధన, వర్సిటీ అభివృద్ధికి పాటుపడుతున్న పలువురు ప్రొఫెసర్లను వర్సిటీ యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఒక్కొక్కరికి రూ.50 వేల నగదు ప్రోత్సాహకం, జ్ఞాపికలను అందజేసి గౌరవించారు. బయోలాజికల్ సైన్సెస్ విభాగానికి చెందిన డాక్టర్ సుదర్శన్ గోవిందరాజన్‌కు ప్రొఫెసర్ వీఎస్ రావు ఫౌండేషన్ ద్వారా ప్రతిష్ఠాత్మక హెచ్‌బి తివారీ బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డును ప్రదానం చేశారు. వీరిలో డాక్టర్ కార్తికేయన్, డాక్టర్ మాగంటి లక్ష్మీశిరీష, డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ మహేశ్‌కుమార్, డాక్టర్ రాజపాండియన్, డాక్టర్ సవ్యసాచి చక్రవర్తి, డాక్టర్ అనుమలమూడి సతీశ్, డాక్టర్ సునిల్ చిన్నదురై, డాక్టర్ విమల్‌బాబు ఉన్నారు. అయిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న డాక్టర్ సత్య ప్రమోద్, ప్రద్యుత్‌కుమార్ సంకీ, తపన్ కుమార్ హోతా, డాక్టర్ ఉదయ్ శంకర్, డాక్టర్ మల్లికార్జున తదితరులకు జ్ఞాపికలను బహూకరించారు. ముంబై ఐఐటీ పూర్వ డైరెక్టర్ ఆచార్య దేవాంగ్ వీ కాకర్ దృశ్య మాధ్యమ పద్ధతిలో వేడుకలకు హాజరై ప్రొఫెసర్లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ సలహాదారు ఆచార్య వజ్జా సాంబశివరావు, హెచ్ఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ శివరంగస్, అసోసియేట్ డైరెక్టర్ రేవతీ బాలకృష్ణన్, అకడమిక్స్ డీన్ వినాయక్, రీసెర్చ్ డీన్ రంజిత్ థాపా, స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, మహిళా విభాగం ప్రతినిధి నివేద పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌పై తప్పుడు ప్రచారం

తాడికొండ, సెప్టెంబరు 24: ఎస్సీ వర్గీకరణను ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ వ్యతిరేకిస్తున్నారని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు నియోజకవర్గ టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌పై గేరా నవీన్‌కుమార్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి నియోజకవర్గ టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

తాడికొండ, సెప్టెంబరు 24: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బోధన ఉంటుందని ఎంఈవో-1 తెనాలి ఇందిరా అన్నారు. మంగళవారం మండలపరిధిలోని పాములపాడు గ్రామంలోని ఎంపీపీ ఉర్దూ పాఠశాల విద్యార్థులకు ఫొటోతో ఉన్న ప్రోగ్రెస్ కార్డులు, గుర్తింపు కార్డులు, టైలను టీడీపీ నాయకులు బండారు శివయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉండాలని కోరారు.

స్వామి ఆగ్రహానికి వైసీపీ నేతలు గురికాక తప్పదు

- జనసేన సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామి వారి లడ్డు కల్తీ ఘటన దృష్ట్యా ఆ స్వామి వారి ఆగ్రహానికి వైసీపీ నేతలు గురికాక తప్పదని జనసేన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రాయశ్చిత్త దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

సమస్యలను పరిష్కరించుకోండి

● మంత్రి మనోహర్ ● వాట్సాప్ నెంబరు ఏర్పాటు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 24: ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించేందుకు నూతనంగా ఏర్పాటుచేసిన వాట్సాప్ నెంబరు ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఈ విధానాన్ని ప్రారంభించారు. 11 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు 7659935993లో తెలియజేయాలన్నారు. 24గంటలు ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉండటం కోసం ఈ విధానం ఉపయోగపడుతుందన్నారు. పట్టణంలోని మున్సిపాలిటీకి సంబంధించి పారిశుధ్యం, చెత్త సేకరణ, రోడ్ల మరమ్మతులు, సిబ్బంది కొరత వీటికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ఈ నెంబరులో తెలియజేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, డిఎస్‌పి జనార్ధన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చినవీరభద్రుడు

సచ్చిదానందమూర్తికి ఘన నివాళి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 24: ప్రపంచంలో గర్వించదగిన తత్వవేత్తలలో పద్మ విభూషణ్ కొత్త సచ్చిదానందమూర్తి ఒకరని రచయిత, మాజీ ఐఏఎస్ అధికారి వాడ్రేవు చినవీరభద్రుడు చెప్పారు. సచ్చిదానందమూర్తి శత జయంతి సభను మంగళవారం బుర్రిపాలెం రోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్‌లో నిర్వహించారు. ఆయన జీవిత విశేషాలతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. వివేకా డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, చైనా, జపాన్ దేశాలు భారతదేశంలోని తత్వవేత్తలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తరువాత డాక్టరేట్ ఇచ్చింది సచ్చిదానందమూర్తికేనని చెప్పారు. షాజహాన్ కుమారుడు ఉపనిషత్తులను పర్షియన్ భాషలోకి అనువదించి ప్రపంచానికి పరిచయం చేశారని, ఆ తరువాతే అవి పలు భాషల్లోకి అనువదించారన్నారు. దళిత సార్వత్రిక విశ్వ విద్యాలయం ఉపకులపతి గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ, నాగార్జున విశ్వ విద్యాలయానికి ఆ పేరు పెట్టడం వెనుక సచ్చిదానంద మూర్తి సూచనలు ఉన్నాయన్నారు. డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, కె.రామరాజు, కృష్ణ, నారాయణ, వెంకటరత్నం, భీమేశ్వరప్రసాద్ ప్రసంగించారు. ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హకీంజాని, దిలీప్‌రాజా, రామలింగాచారి, విజయభాస్కర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

13వ వార్డులో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 24: స్థానిక చినరావూరు 13వ వార్డులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య పనులను మున్సినల్ అధికారులు నిర్వహించారు. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పాల్గొని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డును పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. వార్డు ప్రజలు చెత్తను మురుగు కాలువలలో వేయరాదని, పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

స్వర్ణాంధ్ర 2047పై అవగాహన

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 24: పట్టణ పరపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంపై అధికారులతో అవగాహన సదస్సును పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ, 26వ తేదీలలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో వార్డు సభలు నిర్వహిస్తామని తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాలోని అంశాలు ప్రజలతో చర్చలు నిర్వహించడం, అవగాహన కల్పించడం, అభిప్రాయాలు, సూచనలను సేకరించడం కోసం క్యూఆర్ కోడ్‌ను ప్రచారం చేయడం, వార్డు సభలు సమావేశాలలో ప్రజలు లేవనెత్తిన సమస్యల సమాచారాన్ని అందజేయడం గురించి అవగాహన కార్యక్రమాన్ని వివిధ శాఖల అధికారులతో నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ షైనీ

సామాజిక సేవ చేసేందుకు ఎన్‌ఎస్‌ఎస్ దోహదం

● జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 24: విద్యార్థులు సమాజ సేవ చేసేందుకు ఎన్ఎస్ఎస్ దోహదపడుతుందని జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, 1969లో నేషనల్ సర్వీస్ స్కీంను ప్రవేశ పెట్టారని చెప్పారు. విద్యార్థులు ఇందులో చేరి సేవలు అందించాలన్నారు. సంఘ సేవ చేసే విద్యార్థులకు సర్టిఫికెట్లు లభిస్తాయని, వారికి ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలలో దోహదపడుతాయన్నారు. జాతి సమైఖ్యతకు, క్రమశిక్షణకు ఈ పథకం దోహదపడుతుందని, సమాజంలో అవసరాలను గుర్తించి పరిష్కరించే అవకాశం లభిస్తుందన్నారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, అత్యవసర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో అవగాహన కలుగుతుందన్నారు. నిర్మలజ్యోతి, సాంబశివుడు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల


పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల, సబ్ కలెక్టర్ సంజన సిన్హా, చైర్‌పర్సన్ రాధిక కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 24: వరద ముంపు ప్రాంతాలలో పట్టణ పురపాలక సంఘ పారిశుధ్య కార్మికులు అందించిన సేవలు అభినందనీయమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పట్టణ సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం పురపాలక సంఘ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో వరద ముంపునకు గురైన విజయవాడ ప్రాంతాలలో సహాయక చర్యలు, పారిశుధ్య పనులలో పాల్గొన్న కార్మికులను ప్రత్యేకంగా అభినందించారు. వరద బాధితులకు అధికారుల సమన్వయంతో పారిశుధ్య కార్మికులు అందించిన సేవలను మరువలేమన్నారు. అనంతరం 115మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు.

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గుచూపాలి

శాస్త్రవేత్త రత్నం

తెనాలి రూరల్, సెప్టెంబరు 24: ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి సిద్ధంగా పంటలను సాగుచేసే విధానం వైపు రైతులు మొగ్గుచూపాలని లాంఫామ్ శాస్త్రవేత్త డాక్టర్ రత్నం అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కొలకలూరు, గుడివాడ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన, రైతులకు వ్యవసాయంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ రత్నం మాట్లాడుతూ వ్యవసాయంలో పాత పద్ధతులైన ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గుచూపడం ద్వారా పెట్టుబడులు తగ్గడంతో పాటు ఆరోగ్యకరమైన పంటలను సాగుచేసిన వారవుతారని చెప్పారు. ప్రస్తుతం పండిస్తున్న వరిపైర్లలో అక్కడక్కడా నాము తెగులు ఉండటాన్ని గుర్తించామన్నారు. దాని నివారణకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఈ క్రాప్ నమోదు, పంటల బీమా, పంట ఉత్పత్తుల అమ్మకం వంటి పలు విషయాలను ఏవో ప్రేమ సాగర్ వివరించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రేమసాగర్, డాక్టర్‌రత్నం తదితరులు

శాస్త్రవేత్తల సూచనలతో ఎరువులు వినియోగించాలి: ఏడీఏ

పొన్నూరుటౌన్, చేబ్రోలు, సెప్టెంబరు 24: శాస్త్రవేత్తలు సూచించిన మేరకు వరిలో ఎరువుల వినియోగం చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఐ సునీత అన్నారు. పొన్నూరు మండలం కట్టెంపూడి, పచ్చలతాడిపర్రు గ్రామాలు, చేబ్రోలు మండలం చేబ్రోలు, వేజండ్ల గ్రామాలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో క్షేత్ర సందర్శన కార్యక్రమం జరిగింది. ఖరీఫ్‌లో సాగుచేసిన వరి పంటలను పరిశీలించి రైతులకు చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. రైతులు యాంత్రీకరణ విధానాలను అవలంభించాలన్నారు. పంటల సాగులో అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందాలన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల రైతులు మాట్లాడుతూ తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ పనిముట్లు, వరి కోత యంత్రాలు, మందుల పిచికారికి డ్రోన్లు కావాలని కోరారు. రైతులు కోరిన యంత్ర పరికరాల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాం సైంటిస్టు డాక్టర్ పి.అమరజ్యోతి స్థానిక ఏడీఏ వి.రామకోటేశ్వరి, ఏవో దేగల వెంకటరామయ్య వ్యవసాయ శాఖ సిబ్బంది ఆయా గ్రామాల రైతులు, నాయకులు పాల్గొన్నారు.


వేజండ్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

వరదల సమయంలో రైతులకు అండగా నిలిచిన బాబు, నరేంద్ర

● మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు


కరపత్రాలు పంపిణీ చేస్తున్న మన్నవ సుబ్బారావు, ధూళిపాళ్ల వెంకటేశ్వరావు తదితరులు

పెదకాకాని, సెప్టెంబరు 24: వరదల సమయంలో తీవ్రంగా నష్టపోయిన ప్రజలకు, రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అండగా నిలిచారని పొన్నూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు, మిర్చియార్డ్ మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు అన్నారు. పెదకాకాని మండలం అగతవరప్పాడు, వెంకటకృష్ణాపురంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఇతర టీడీపీ నేతలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మన్నవ సుబ్బారావు మాట్లాడుతూ.. విజయవాడలో వరదల వల్ల నష్టపోయిన ముంపు బాధితులకు చంద్రబాబునాయుడు ఉదారంగా సాయం అందించారన్నారు. పొన్నూరు నియోజకవర్గంలోనూ భారీ వర్షాల వల్ల రైతులు నష్టపోయారు. వారికి అన్ని విధాల ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అండగా నిలిచారు. వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం అనేక హామీలు నెరవేర్చిందన్నారు. జగన్ రెడ్డి పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను మంటగలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి ఉపయోగించి మహాపచారానికి పాల్పడ్డారన్నారు. గత ఐదేళ్లలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్తుల అన్యాక్రాంతం పైనా ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటకృష్ణాపురం సర్పంచ్ ధూళిపాళ్ల వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు జి.పూర్ణచంద్రరావు, అగతరపాడు టీడీపీ నాయకులు టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పొన్నూరు 16వ వార్డులో ...

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 24: పట్టణంలోని 16వ వార్డులో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వార్డులో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ కరపత్రాలను పంచిపెట్టారు. వంద రోజులో కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వార్డుల అధ్యక్షుడు వేజండ్ల హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల అపచారంపై స్వామీజీలు నోరు మెదపరే

● బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు శ్రీధర్ శర్మ

గుంటూరు, సెప్టెంబరు 24: స్వామీజీలు తిరుమల అపచారంపై నోరు మెదపరేమని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపు రపు శ్రీధర్ శర్మ ప్రశ్నించారు. గుంటూరులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో పెట్టుడు పీఠాలు పెట్టుకున్న చిన్న జీయర్‌స్వామీజీ, విశాఖ శారద పీఠాధిపతులు స్వరూపానంద స్వామీజీ, సాత్వానంద స్వామీజీలు ఈ విషయం మీద ఎందుకు నోరు మెదపట్లేదని శ్రీధర్ ప్రశ్నించారు. మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ మాటలు వైసీపీ నాయకుల అహంకారానికి నిదర్శనం అని శ్రీధర్ దుయ్యబట్టారు. కార్యక్రమంలో వడ్డమాను ప్రసాదు, వంగవీటి చైతన్య చిలుమూరు ఫణి, ఎండపల్లి శబరి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో ప్రసాద్

విద్యార్థుల హాజరు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

● ఎంఈవో ఏవీహెచ్ ప్రసాద్

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 24: విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈవో ఏవీహెచ్ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పొన్నూరు పట్టణ, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నిర్వాహకుల సమావేశం జరిగింది. ఎంఈవో మాట్లాడుతూ టీచర్ల అటెండెన్స్ యాప్, స్టూడెంట్స్ అటెండెంట్స్ యాప్‌లను సక్రమంగా నిర్వహించాలన్నారు. మధ్యాహ్న భోజన వివరాలు పాఠశాలల నిర్వహణ వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో రెండవ ఎంఈవో కె శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సాంబయ్యకు ఆర్థికసాయం చేస్తున్న టీడీపీ నాయకులు

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 24: పొన్నూరు పట్టణంలో షాదీ ఖానా, ఉర్దూ ఘర్ పర్యవేక్షకుడు సాంబయ్య కుటుంబానికి టీడీపీ నాయకులు అండగా నిలిచారు. సాంబయ్య కుమార్తె వివాహం నిశ్చయం కాగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు పట్టణ తెలుగు దేశం పార్టీ మైనార్టీ నాయకులు షాదీఖానా నిర్వహణ నుంచి రూ.10 వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందచేశారు.


నంబూరులో స్వచ్ఛత హీ సేవలో పాల్గొన్న వీవీఐటీ విద్యార్థులు

వీవీఐటీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల 'స్వచ్ఛత హీ సేవ'

పెదకాకాని, సెప్టెంబరు 24: వీవీఐటీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమం నంబూరు గ్రామ పంచాయతీలో మంగళవారం నిర్వహించారు. పర్యావరణాన్ని దెబ్బతీసే ప్లాస్టిక్ వంటి వస్తువుల వినియోగాన్ని తగ్గించాలని, కాలుష్యరహిత సమాజాన్ని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో గ్రామంలో గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబరు 17 నుంచి 23 వరకూ ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి విద్యార్థి మూడుకేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి నంబూరు పంచాయతీకి అందజేశారు. పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేదం వంటి అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రపరిచారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించారు. విద్యార్థులు గ్రామంలో మానవహారం నిర్వహించి గ్రామస్థులతో స్వచ్ఛత హీ సేవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమములో గ్రామ పంచాయతీ సెక్రటరీ మహ్మద్ ఉత్మాన్ సాదిక్ ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అఫీసర్ ఐఎల్‌జే భక్త సింగ్, టి.విజయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న జేసీ భార్గవ తేజ

సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలి: జేసీ

గుంటూరు(విద్య), సెప్టెంబరు 24: విద్యార్థులు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ పిలుపునిచ్చారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని యూఈఏసీ (యూనివర్సిటీ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీ కౌన్సిల్) విద్యార్థుల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్‌డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భార్గవ్ తేజ మాట్లాడుతూ విద్యార్థులందరూ సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించడానికి కృషి చేయాలన్నారు. యూనివర్సిటీ పరిధిలోని 5 గ్రామాలను (శలపాడు, వడ్లమూడి, వీరనాయకునిపాలెం, వేజండ్ల, సుద్దపల్లి) దత్తత తీసుకుని సంవత్సర కాలంలో 107 సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ సమీప ప్రాంతాల్లోని ప్రజలకు విద్య, ఆరోగ్యం, కాలుష్యం సమస్యలను పరిష్కరించడం, సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు.


ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌కు స్వాగతం పలుకుతున్న వాషింగ్టన్ తెలుగు సాంస్కృతిక సంఘం నాయకులు

తెలుగు సాంస్కృతిక సంఘం స్వర్ణోత్సవాలకు ధూళిపాళ్ల

వాషింగ్టన్‌లో స్వాగతం పలికిన సంఘం సభ్యులు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 24: బృహత్తర వాషింగ్టన్ తెలుగు సాంస్కృతిక సంఘం స్వర్ణోత్సవాల్లో పాల్గొనేందుకు పొన్నూరు ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మంగళవారం అమెరికాలోని వాషింగ్టన్ వెళ్లారు. ఈ సందర్భంగా వాషింగ్టన్ డీసీలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌కు వాషింగ్టన్ తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు కృష్ణ లాం ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం పలికారు. తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమన, ప్రదీప్ గౌరపనేని, యష్ బొద్దులూరి తదితరులు నరేంద్ర కుమార్‌కు సాదర స్వాగతం పలికారు. 49 వసంతాలు పూర్తి చేసుకుని 50వ వసంతంలోని వాషింగ్టన్ తెలుగు సాంస్కృతిక సంఘం అడుగులు పెడుతున్న సందర్భంగా ఈ స్వర్ణోత్సవాలను నిర్వహిస్తున్నారు.

పెదకాకాని శివాలయం నూతన ఉపకమిషనరుగా

లీలాకుమార్ బాధ్యతల స్వీకారం


శివాలయం నూతన ఈవో గా బాధ్యతలు చేపడుతున్న లీలా కుమార్

పెదకాకాని, సెప్టెంబరు 24: పెదకాకాని మల్లేశ్వరస్వామి వారి దేవస్థాన నూతన ఉపకమిషనరు, కార్యనిర్వహణాధికారిగా జి.వి.డి.ఎన్. లీలాకుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీ అయిన ఈవో శ్రీరామవరప్రసాద రావు నుంచి పరిపాలనాపరమైన బాధ్యతలు స్వీకరించారు. దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిలో ఉపకార్యనిర్వహణాధికారిగా పనిచేస్తూ సాధారణ బదిలీలలో భాగంగా లీలాకుమార్ మల్లేశ్వరస్వామి వారి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా నియమితులయ్యారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రదక్షణలు చేసి భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకం, అమ్మవారి కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఆలయ స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, అర్చక స్వాములు, వేదపండితులు వేద ఆశీర్వచనము చేసి స్వామి వారి శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు, వసతుల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటానని లీలాకుమార్ తెలిపారు.


వీవర్స్ కాలనీలో మురుగు కాల్వలను పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్ బాబు తదితరులు

వార్డులో తాగునీటి సమస్యలకు తక్షణ పరిష్కారం

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 24: పురపాలక సంఘంలోని వార్డులో తాగునీటి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపుతామని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. పొన్నూరు పట్టణంలోని వీవర్స్ కాలనీలోని పలు వార్డుల్లో మంగళవారం కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో కలిసి వార్డులు సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలో జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ వార్డులో ప్రజలు తాగునీటి సమస్యలు, మురుగు కాల్వల గురించి ఫిర్యాదు చేశారన్నారు. మురుగు కాల్వల్లో సిల్ట్ తొలగింపు పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మెంబర్‌గా కోటేశ్వరరావు



తెనాలి రూరల్, సెప్టెంబరు 24: రాష్ట్ర సివిల్ సప్లయిస్ (పౌరసరఫరాల) కార్పొరేషన్ మెంబర్‌గా తెనాలి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కేసన కోటేశ్వరరావు నియమితులయ్యారు. మంగళవారం కూటమి ప్రభుత్వం కార్పొరేషన్ పదవుల జాబితాలో ఆయన పేరు ఉంది. తెనాలి మండలంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా కేసన బాధ్యతలు చేపట్టిన నాటి నుండి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కేసన కోటేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాజీమంత్రి ఆలాపాటి రాజేంద్రప్రసాద్ ప్రోద్భలంతోనే తనకంటూ ప్రత్యేక స్థానం లభించిందని, మరింత బాధ్యతగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తానని కేసన కోటేశ్వరరావు స్పష్టం చేశారు. ఆయనను పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి ప్రత్యేకంగా అభినందించారు.

పద్మశాలీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మెంబర్‌గా జొన్నాదుల



రాష్ట్ర పద్మశాలీల వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మెంబర్‌గా జొన్నాదుల మహేష్ నియమితులయ్యారు. తెనాలి నియోజవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడిగా ఉన్న ఆయనకు ఈ అవకాశం దక్కింది. సీఎం చంద్రబాబునాయుడికి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మహేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పలువురు కూటమి శ్రేణులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.